RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 57 ఆదివారం 23 మార్చి 2025 పేజీలు : 4

## ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌లో శాంతి

న్యూఢిల్లీ : జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఉగ్రవాదం విషయంలో యువత ప్రమేయం దాదాపు కనుమరుగైందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాజ్యసభలో చెప్పారు. యూపిఏ హయాంలో ఉగ్రవాదులను కీర్తించడంతో పాటు ఉగ్రవాదుల శవాలతో అంత్యక్రియలు జరిగేవని, ప్రస్తుతం ఉగ్రవాదులను హతమార్చిన చోటే పూడ్చిపెడుతున్నామన్నారు. 2004 నుంచి 2014 మధ్య 7,2,17 ఉగ్రవాద ఘటనలు జరిగితే 2014 నుంచి 2024 మధ్య 2,242 ఘటనలు జరిగాయన్నారు. ఉగ్రవాదం కారణంగా జరిగే మరణాల సంఖ్య 70 శాతం తగ్గిందన్నారు.
ఉగ్రవాదాన్ని ఏ మాత్రం ఉపేక్షించడం లేదని యూరీ, పుల్వామా ఘటనల తర్వాత పది రోజుల వ్యవధిలోనే సర్జికల్, ఎయిర్ స్ట్రైక్స్ జరిపి గట్టిగా బదులిచ్చామన్నారు. 2024లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

# దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రానిది...

# సవతి తల్లి ప్రేమ!




## తెలంగాణకు 42 పైసలే.. బిహార్‌కు మాత్రం రూ.6.06 : సీఎం రేవంత్

## 25 ఏళ్ళ పాటు నియోజకవర్గాల పునర్విభజనను వాయిదా వేయాలని ఆల్ పార్టీ మీటింగ్ లో తీర్మానం

చెన్నై: కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పన్నుల రూపంలో కేంద్రానికి రాష్ట్రాలు భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలోనే తిరిగి పొందుతున్నామని పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. 'తెలంగాణలో వేగవంతమైన ఆర్థిక అభివృద్ధిని సాధించాం. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలోనూ వృద్ధి సాధించాం. తెలంగాణలో సుపరిపాలనతోపాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలో తిరిగి పొందుతున్నాం. రూపాయి చెల్లిస్తే.. తెలంగాణకు 42 పైసలు తిరిగొస్తున్నాయి. తమిళనాడుకు 26 పైసలు, కర్ణాటకకు 16 పైసలు, కేరళకు 49 పైసలు మాత్రమే లభిస్తున్నాయి. కానీ, బిహార్ మాత్రం రూపాయికి రూ.6.06 పొందుతోంది. యూపీకి రూ.2.03, మధ్యప్రదేశ్‌కు రూ.1.73 మేర లభిస్తోంది" అని రేవంత్‌రెడ్డి వివరించారు. "రాణిస్తున్న రాష్ట్రాలకు రాజకీయ పరిమితులు విఘాతం సృష్టిస్తాయి. డీలిమిటేషన్.. రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానత్వం తీసుకువస్తుంది. పారదర్శకంగా లేని ఈ విధానంపై భాజపాను కట్టడి చేయాల్సి ఉంది. లోక్‌సభ సీట్లు పెంచవద్దు.. రాష్ట్రాల్లో అంతర్గత డీలిమిటేషన్ చేపట్టాలి. 1976లో లోక్‌సభ సీట్లు పెంచకుండానే డీలిమిటేషన్ చేపట్టారు. ప్రధాని మోదీ కూడా లోక్‌సభ సీట్లు పెంచకుండా దీనిని చేపట్టాలి. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించవు. ఇలా చేస్తే దక్షిణాది రాజకీయ వాణి కోల్పోతుంది. దక్షిణాదిని సెకండరీ సిటిజన్లుగా ఉత్తరాది మారుస్తుంది. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను ఆమోదించొద్దని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నాం. ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోం" అని రేవంత్ స్పష్టం చేశారు.

**డీలిమిటేషన్?పై హైదరాబాద్?లో బహిరంగ సభ పెడ్తాం: సీఎం రేవంత్...** డీలిమిటేషన్ పై హైదరాబాద్ లో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. చెన్నైలో మీడియాతో మాట్లాడిన ఆయన.. డీలిమిటేషన్ పై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. దీనిపై హైదరాబాద్ లో మరో అఖిలపక్ష సమావేశం నిర్వహించి బహిరంగ సభ పెడతామన్నారు. డీలిమిటేషన్ విషయంలో బీజేపీ సొంత ఎజెండాతో ముందుకెళ్తుందని ఆరోపించారు సీఎం రేవంత్. దక్షిణాది ప్రజల సమస్యలు బీజేపీకి పట్టడం లేదన్నారు. ఇది పార్టీల సమస్య కాదు..దక్షిణాది ప్రజల సమస్య అని అన్నారు. డీలిమిటేషన్ పై పార్లమెంట్ లో ఎందుకు చర్చ పెట్టడం లేదని ప్రశ్నించారు రేవంత్. దక్షిణాది రాష్ట్రాలను కేంద్రం మోసం చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రం ఏ ప్రాతిపాదికన నియోజకవర్గాల పునర్విభజనన చేయాలను కుంటుందో అర్థం కావట్లేదన్నారు. డీలిమిటేషన్ పై కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఎందుకు ఏర్పాటు చేయడం లేదన్నారు. స్టాలిన్ పోరాటాన్ని ఢిల్లీ స్థాయికి తీసుకెళ్తాం..అన్ని రాష్ట్రాలను కలుపుకుని ముందుకెళ్తామన్నారు సీఎం రేవంత్. మార్చి 22న డీలిమిటేషన్ పై జరిగిన ఆల్ పార్టీ మీటింగ్ కు తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మల్లు రవి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హాజరయ్యారు. 25 ఏళ్ల వరకు నియోజకవర్గాల పునర్విభజనను వాయిదా వేయాలని ఆల్ పార్టీ మీటింగ్ లో తీర్మాణం చేశారు.




## మళ్లీ విజృంభించిన బర్డ్ ఫ్లూ..

తెలుగు రాష్ట్రాల్లో గత నెల రోజుల కిందట బర్డ్ ఫ్లూ వణికించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బర్డ్ ఫ్లూ తగ్గుముఖం పట్టింది. దీంతో వినియోగదారులు కూడా చికెన్ సెంటర్ల వైపు పరుగెత్తారు. చికెన్ ధరలు పెరిగినా కొనేందుకు ఆసక్తి చూపించారు. అయితే ఇప్పుడు తాజాగా మరోసారి బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఈ వ్యాధితో కోళ్లు చనిపోతున్నట్లు అధికారులు నిర్ధారించారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ఓ ఫామ్‌లోని కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలోని ఒక కోళ్ళ ఫారంలో 500 కోళ్ళు బర్డ్ ఫ్లూ సోకి మృతి చెందాయని చెబుతున్నారు. దీంతో 52 వేల కోళ్ళు, 17 వేల కోడి గుడ్లు, 85 టన్నుల దానాను భూమిలో పూడ్చిపెటినట్టు అధికారులు వెల్లడించారు. ఆ ప్రాంతం అంతా శానిటైజ్ చేశారు. ఎక్కడైతే కోళ్ల ఫామ్స్ ఉంటాయో.. ఆ చుట్టుపక్కల ప్రాంతాలను అధికారులు రెడ్ జోన్‌గా ప్రకటించారు. సమీప గ్రామ ప్రజలను కూడా అటువైపు రావద్దంటూ అధికారులు సూచించారు. వరుస బర్డ్ ఫ్లూ సంఘటనలతో నష్టాల్లో పేరుకపోతున్నామని కోళ్ళ ఫారం యజమానులు, మాంసం వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇక, పశువైద్య అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఆ పౌల్ట్రీఫామ్‌ను సందర్శించారు. మూడు నెలల వరకు ఈ పౌల్ట్రీఫామ్‌ను సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత ఈ ఫామ్‌లను నిర్వహించుకోవచ్చని తెలిపారు. అక్కడ అధికారులు పీపీఈ కిట్లు ధరించి.. 40 వేల కోళ్లను చంపారు. వాటిని అక్కడే చుట్టు పక్కల ప్రాంతంలో గోతి తీసి పూడ్చిపెట్టారు. వాటితో పాటు దాదాపు 19 వేల కోడిగుడ్లను సైతం పూడ్చి పెట్టారు. అంతే కాకుండా.. ఇదే ఫాంలోని కోళ్ల పెంటను కూడ దహనం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## కేసీఆర్ రాజకీయాల నుంచి తప్పుకో.. మంత్రి కోమటిరెడ్డి షాకింగ్ కామెంట్స్




హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలకు ధరణితో దోచుకుతినడం తప్పా ఏమి తెలవదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. ఈరోజు (శనివారం) అసెంబ్లీ మీడియా పాయిట్‌లో బీఆర్ఎస్ నేతలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ తండ్రి చాటు కొడుకు.. మాజీ మంత్రి హరీష్‌రావు మామ చాటు అల్లుడని ఎద్దేవా చేశారు. వాళ్లు కనీసం డిప్యూటీ లీడర్లు కూడా కాదని విమర్శించారు. వాళ్లతో తాము ఏం మాట్లాడతామని దెప్పిపొడిచారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అప్పుడు డమ్మీ మంత్రిగా ఉండే వారని విమర్శించారు. ఆయనను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కనీసం గుర్తు కూడా పట్టారని అన్నారు. ప్రశాంత్ రెడ్డి మెంటల్ పట్టినట్లుగా మాట్లాడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. ఉప్పల్, నారపల్లి ఫ్లై ఓవర్ పనులు గడ్కరీతో మాట్లాడి తాను చేపిస్తున్నానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతలకు అబద్దాలతో బతకడం బాగా అలవాటైందని ఎద్దేవా చేశారు. త్వరలో ఉస్మానియా హాస్పిటల్‌కు టెండర్లు పిలుస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్ నేతలకు మెంటల్.. మైండ్ పనిచేయడం లేదని విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను ఎర్రగడ్డ హాస్పిటల్‌కు పంపించాలని ఎద్దేవా చేశారు. పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ చెప్పిన అబద్ధాలకు అసలు శిక్షలే సరిపోవని చెప్పారు. కేసీఆర్ పదిలక్షల అబద్ధాలు ఆడారని విమర్శించారు. కేసీఆర్ మీద సభా హక్కుల ఉల్లంఘన నోటీస్ ఇవ్వాలని అన్నారు. దళితుడిని సీఎం చేయకపోతే తల తీసుకుంటానని ఆయన అన్నారని గుర్తుచేశారు. కేసీఆర్‌ను తలతీసి ఇవ్వమని అడగాలని అన్నారు. లేదంటే రాజకీయాల నుంచి తప్పుకోమని చెప్పాలన్నారు.




## ఆ రేసులో నేను లేను.. తేల్చిచెప్పేసిన బండి సంజయ్

హైదరాబాద్, మార్చి 22: తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడి ఎంపిక త్వరలోనే జరుగనుంది. ఈ పదవి కోసం పార్టీలోని ఆశావాహులు ఎదురుచూస్తున్న పరిస్థితి. ఆ పదవి తమకే రావాలని పలువురు సీనియర్ నేతలు కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా... తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ అంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో బీజేపీ అధ్యక్షుడి పదవిపై వస్తున్న వార్తలకు కేంద్రమంత్రి పుల్‌స్టాప్ పెట్టేశారు. 'నేను రాష్ట్ర అధ్యక్ష రేసులో లేను, నాకే రావాలని కోరుకోవడం లేదు' అని తేల్చి చెప్పేశారు. అలాగే సోషల్ మీడియా, మీడియాలో వచ్చే పేర్లపై, ప్రచారం చేసుకునే నేతలపై అధిష్టానం సీరియస్‌గా ఉందని కేంద్రమంత్రి వెల్లడించారు. బండి సంజయ్ ఇంకా మాట్లాడుతూ.. డీలిమిటేషన్‌పై చెన్నైలో తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన జరుగుతున్న దక్షిణాది రాష్ట్రాల సమావేశంపై స్పందించారు. స్టాలిన్ మీటింగ్‌లో ఉన్నది అందరూ దొంగలే అంటూ కామెంట్స్ చేశారు. లిక్కర్ స్కామ్, ల్యాండ్ స్కామ్ ముఠాలు మీటింగ్ పెట్టుకున్నాయని దుయ్యబట్టారు. మీటింగ్‌లో పాల్గొన్న పార్టీలకు అవినీతి చరిత్ర ఉందన్నారు. కేసీఆర్ కుటుంబానికి నోటీస్ ఎందుకు ఇవ్వవు రేవంత్ అని ప్రశ్నించారు. డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమే కాలేదని తెలిపారు. తమిళనాడులో డీఎంకే వెయ్యి కోట్ల లిక్కర్ స్కామ్ చేసిందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏర్పడి 15 నెలలు అయినా రైతులను పట్టించుకోవడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.




## నిరుద్యోగులకు సర్కార్ గుడ్ న్యూస్

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రెవెన్యూ శాఖలో కొత్తగా గ్రామ పాలన అధికారుల పోస్టులు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నూతన గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థకు జీపీఓగా నామకరణం చేసింది. మొత్తం 10,924 పోస్టులను మంజూరు చేసింది. మాజీ వీఆర్వోలు, మాజీ వీఆర్ఏల నుంచి ఆప్షన్లు తీసుకుని వీటి నియామకాలు చేపట్టనున్నారు. ఇక, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల టైంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. ఆరు హామీల్లో భాగంగా ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు అండగా నిలవడానికి ప్రభుత్వం కొద్దిరోజుల క్రితమే రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 5 లక్షల మందికి ఏకంగా 6 వేల కోట్ల రాయితీ రుణాలు మంజూరు చేయనుంది. ఈ పథకం ద్వారా 5 లక్షల మంది నిరుద్యోగ యువత లబ్ధి పొందనున్నారు. ఈ పథకంలో భాగంగా ఒక్కో లబ్దిదారుడికి 4 లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నారు. తీసుకునే లోన్ అమౌంట్ బట్టి రాయితీ 60 నుంచి 80 శాతం వరకు వస్తుంది. ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఏప్రిల్ 6వ తేదీనుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన ఉంటుంది. జూన్ 2వ తేదీన రాయితీ రుణాలు మంజూరు చేస్తారు.




## తెలంగాణలో మళ్లీ అధికారం బీఆర్ఎస్ పార్టీదే : కేసీఆర్

తెలంగాణను పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన విషయం తెలిసిందే. అయితే తాము అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని సందర్భం వచ్చిన ప్రతిసారి గులాబీ నేతలు చెబుతూనే ఉన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు పక్షాన తరచూ గొంతు వినిపిస్తున్నారు. అయితే రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీ పకడ్బందీగా ప్రణాళికలు వేస్తోంది. ఈ నేపథ్యంలోనే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న ఆయన రాష్ట్ర రాజకీయాలపైన ఓ కన్నేసి ఉంచారు. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారం బీఆర్ఎస్ పార్టీదేనని ఆయన పునరుద్ఘాటించారు. ఈసారి సింగిల్ గా అధికారంలో వస్తామని జోస్యం చెప్పారు. బెల్లం ఉన్న దగ్గర ఈగలు వచ్చినట్టే.. సిరిసంపదలు ఉన్న తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని కేసీఆర్ అన్నారు. పదేళ్లు తెలంగాణలో ఎటువంటి ఇబ్బందులు లేవన్న ఆయన.. ఇప్పుడు రాష్ట్రం సమస్యల వలయంలో చిక్కుకుందని తెలిపారు.

# సంపాదకీయం

## విశాఖ ఉక్కుపై విడతల వారీ 'ఊగిసలాట'!

ఆంధ్రుల హక్కుగా ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు విడతల వారీగా చెబుతున్న సమాధానాలు.. ఇస్తున్న లీకులు.. అనేక సందేహాలను అలానే పెంచి పోషిస్తున్నాయి. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌గా పేర్కొనే.. విశాఖ ఉక్కు పరిశ్రమ వ్యవహారం 2021లో తొలిసారి కుదుపునకు గురైంది. దీనిలో ప్రభుత్వానికి ఉన్న వాటాలను.. అమ్మేస్తున్నామని పార్లమెంటులో ప్రకటించారు. ఇది రాజకీయంగానే కాకుండా.. ఉద్యోగుల పరంగా కూడా.. తీవ్ర వివాదానికి దారి తీసింది. కేంద్ర ఆర్థిక శాఖ నేతృత్వంలోని పెట్టుబడుల ఉపసంహరణ కమిటీ... విశాఖ ఉక్కు పరిశ్రమకు సంబంధించి పూర్తిస్థాయిలో పెట్టుబడుల ఉపసంహరణ చేయాలని సూచించిందని ఆనాడు కేంద్ర ఆర్థిక మంత్రి గా ఉన్న నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అయితే.. దీనిని ప్రైవేటీకరించవద్దంటూ.. అప్పటి సీఎం జగన్.. లేఖలు సంధించారు. ఇక, ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. నిరసనలు, ధర్నాల పేరుతో కొంత ఉద్యమం కూడా సాగింది. ఇక, అప్పట్లోనే కేంద్రం.. దీనిని ప్రైవేటీకరించి తీరుతామని చెప్పింది. నష్టాలు-కష్టాలు భరించలేని స్థాయి లో ఉన్నాయని స్పష్టం చేసింది. సొంతగా బొగ్గు గనులు కేటాయించని కారణంగానే విశాఖ ఉక్కు ఇబ్బం దుల్లో ఉందన్న కార్మికుల ఆవేదన కొనసాగింది తప్ప.. ఎక్కడా బ్రేకులు పడలేదు. కట్ చేస్తే.. ఇప్పుడు ఎన్డీయే కూటమి ప్రభుత్వం తలకో మాట చెబుతోంది. గత రెండు నెలల కిందట రూ.11,400 కోట్లను కేటాయించి.. ఉక్కు పరిశ్రమను గాడిలో పెట్టేందుకు సమ్మతిస్తున్నట్టు పేర్కొంది. ఇదే సమయం లో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామి సైతం విశాఖలో పర్యటించి.. ఫ్యాక్టరీని ప్రైవేటీకరించ బోమన్నారు. కానీ.. మరో వైపు.. పార్లమెంటులో మాత్రం.. పెట్టుబడుల ఉపసంహరణ విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి మార్పు లేదని ఆర్థిక శాఖ చెబుతోంది. తాజాగా బుధ, గురువారాల్లో పార్లమెంటు సభ్యులు సంధించిన ప్రశ్నలకు ఆర్థిక శాఖ ఈ సమాధానమే చెప్పడం గమనార్హం. 2021లో పెట్టుబడుల ఉపసంహరణలపై నియమించిన కమిటీ విశాఖ ఉక్కు విషయంలో చేసిన సూచనల విషయంలో ఎలాంటి మార్పు లేదు అని కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. దీంతో అటు కార్మిక సంఘాలు.. ఇటు రాజకీయ వర్గాలు కూడా.. తర్జన భర్జన పడుతున్నాయి. మరో వైపు.. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ పెండింగులో ఉంది. ఈ పరిణామాలతో విశాఖ ఉక్కు పరిస్థితి ఏంటన్నది చర్చగా మారుతుండడం గమనార్హం.

# రేషన్ బియ్యం.. ఇప్పుడెలా?



పూడూరు : పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పంపిణీ ఈ నెలకు సంబంధించి ఆందోళనకు గురిచేస్తోంది. ప్రతి నెల 1వ తేదీ నుంచి సమీపంలోని ఎమ్ఎల్ఎస్ పాయింట్ల నుంచి ఆయా గ్రామాల డీలర్‌లకు లారీల ద్వారా సరఫరా చేస్తారు. 5వ తేదీ నుంచి 16వ తేదీవరకు పంపిణీ పూర్తి కావాల్సి ఉంటుంది. కానీ ఈసారి రెండు వారాలు దాటినా అందరికీ రాలేదు. ఇటీవలే వచ్చాయి. కానీ గడువేమో నేటితో పూర్తవుతోంది. బియ్యం పొందడానికి లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు.

**నాలుగు రోజుల క్రితమే వచ్చాయి**

నాలుగు రోజుల క్రితం పూర్తి స్థాయి బియ్యం గ్రామాలకు చేరుకున్నాయి. పంపిణీకి సంబంధించి చివరితేదీ ఈనెల 20 వరకు పొడిగించినా అదికూడా నేటితో పూర్తవుతోంది. సమయం ఒకేరోజు ఉండటంతో కూలీలు ఇతర పనుల నిమిత్తం వెళ్లేవారికి ఇబ్బందిగా మారింది. ఈ– పోస్ విధానం కావటంతో ఆహార భద్రత కార్డుదారుల్లో ఎవరో ఒకరు రేషన్ దుకాణానికి వచ్చి వేలిముద్ర వేయాల్సిందే.వీరంతా తీసుకోవాలంటే కష్టంగా మారుతోంది.

**కొత్త వారి సంగతేమిటి**

చాలాకాలంగా కొత్తరేషన్ కార్డులు లేకపోవటం, కొత్తగా పెళ్లయి వచ్చిన మహిళలు, పిల్లల పేర్లు రేషన్ కార్డులో నమోదు కాలేదు. దీంతో ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీకి అవకాశం కల్పించింది. కొత్తవారి పేర్లు ఇంకా నమోదు కాలేదు. ఐదేళ్ల క్రితం కొత్తగా రేషన్‌కార్డుల కోసం అర్జీలు పెట్టుకున్న వారిలో కొందరికి మాత్రమే అవకాశం కల్పించారు. వీరు మాత్రమే ఈనెల కోటాలో ఉచిత బియ్యం అందుకున్నారు.

మరికొంత సమయం అవసరం

జిల్లాలోని లబ్ధిదారులకు ఇచ్చేందుకు సమయం తక్కువగా ఉండటంతో కొంత మంది తీసుకునేందుకు ఆస్కారం లేదు. మరో నాలుగు రోజులు గడువు ఇస్తే బాగుంటుంది.

జూకారెడ్డి, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో మొత్తం ఆహార భద్రత కార్డులు.. 2.41 లక్షలు

రేషన్ దుకాణాలు.. 588

నెలకు వచ్చే బియ్యం.. 44 లక్షల మెట్రిక్ టన్నులు

# ప్రజా చైతన్యం.. సామాజిక సేవ



సిరిసిల్ల : శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ పోలీసుల ప్రధాన విధి. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు ప్రజలకు చేరువయ్యేందుకు చేపడుతున్న పలు కార్యక్రమాలు స్ఫూర్తి నింపుతున్నాయి. నిరుద్యోగ యువతకు తరచూ ఉద్యోగ మేళాలు నిర్వహించడం. క్రీడల్లో సత్తాచాటేలా యువతతో దోస్తీమీట్లో పోటీలు, విద్యార్థిదశలోనే సైబర్ నేరాలపై అవగాహన. పాఠశాల, కళాశాలల్లోని బాలికలు, గ్రామాల్లోని మహిళలకు పలు అంశాల్లో ఉపయోగకర కార్యక్రమాలు చేపడుతున్నారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్టవేసేందుకు పోలీసు అక్క పేరుతో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనికోసం పోలీస్‌స్టేషన్లలో నూతనంగా నియామకమైన మహిళా కానిస్టేబుళ్లకు బాధ్యతలు అప్పగించారు. పాఠశాలలు, కళాశాలలు గ్రామాల్లో మహిళలకు ఉన్న ప్రత్యేక చట్టాలు, వాటి అమలుపై జిల్లా షీటీం బృందంతో అవగాహన కల్పిస్తారు. ఫిర్యాదులు సైతం అక్కడే స్వీకరిస్తున్నారు.

"వేములవాడ మండలం తిప్పాపూర్ ప్రభుత్వ పాఠశాలలో జనవరి నెలలో 'పోలీసు అక్క'పై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఇంటి ఎదురుగా ఉన్న యువకుడు వేధిస్తున్నాడని పదోతరగతి విద్యార్థిని షీటీం బృందానికి ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపి అతనికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అతనిపై ఈ పెట్టీకేసు నమోదు చేశారు."

జిల్లాలో వాహనాలు తనిఖీల సమయంలో డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా చాలామంది పట్టుబడుతున్నారు. దీనికోసం ప్రతి పోలీస్టేషన్‌లో ఉచిత డ్రైవింగ్ లైసెన్సు డ్రైవ్ చేపట్టారు. దరఖాస్తులు చేసుకున్నవారికి రెండు విడతలుగా జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో పరీక్షలు నిర్వహించి 500 మందికి ద్విచక్రవాహన, ఎల్ఎంవీ లైసెన్స్‌లు ఇప్పించారు. యువతను గంజాయి, డ్రగ్స్ మత్తు నుంచి దూరం చేస్తూ.. క్రీడల్లోరాణించేలా 'దోస్తీమీట్'ను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ అటల్లో ఆసక్తి ఉన్నవారిని గుర్తించి వారికి నిపుణులతో తర్ఫీదు ఇప్పించారు. మండలస్థాయిలో పోటీలు నిర్వహించారు. అక్కడ మంచి ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఇలా వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ప్రతిభచూపిన వారిని జిల్లా క్రీడల అసోసియేషన్ గుర్తించి రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఎంపిక చేశారు.

**ప్రతిభను గుర్తిస్తున్నారు- ఎండీ బఫత్‌ఖాజా, తడగొండ, బోయినపల్లి**

పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి ఉంది. డిప్లొమా పూర్తిచేసి గ్రామంలోనే ఆటోనడుపుతున్నా. పోలీసులు మండలస్థాయిలో నిర్వహించిన దోస్తీమీట్లో కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. మాజట్టు జిల్లాకు ఎంపికైంది. అక్కడి పోటీలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ నా ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ప్రతిభను గుర్తించడం ఎంతో ఆనందంగా ఉంది.

జాబ్‌మేళాలో దరఖాస్తు చేసుకున్నా– బైరి కళ్యాణి, అడవిపదిర, వీర్నపల్లి

బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేశాక ఉద్యోగం కోసం సిరిసిల్ల, కరీంనగర్ పట్టణాల్లోని ఆసుపత్రుల్లో సంప్రదించాను. ఉద్యోగ అనుభవం లేదని తిరస్కరించారు. వీర్నపల్లిలో పోలీసులు నిర్వహించిన జాబ్‌మేళాలో దరఖాస్తు చేసుకున్నా. విద్యార్హత పత్రాలను పరిశీలించి హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆసుపత్రిలో ఉద్యోగం ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది. అన్ని వర్గాలకు చేరువ– అఖిల్ మహాజన్, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల

అన్నివర్గాల ప్రజలకు చేరువ కావడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యువతకు అనేక అంశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో నేరాల నియంత్రణ సులభతరమవుతోంది. ఈ మధ్య సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల పెరుగుతున్నాయి. ఖాకీ కిడ్స్ పేరుతో స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థుల్లో చైతన్యం కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆయా అంశాలను చిన్నారులు వారి తల్లిదండ్రులకు వివరించాలనేది లక్ష్యం.

# రంగనాయకసాగర్‌పైనే ఆశలు

సిరిసిల్ల: రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. చెరువులు, వ్యవసాయ బోరుబావుల్లో నీటినిల్వలు అడుగంటుతున్నాయి. జిల్లాలోని తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో చెరువుల్లో నీటినిల్వలు బాగా తగ్గాయి. ప్రధానంగా తంగళ్లపల్లి మండలంలోని చంద్రవంక ప్రాజెక్టు కింద 800 ఎకరాల ఆయకట్టు ఉండగా ఈ యాసంగిలో నీటిలభ్యత తక్కువగా ఉండటంతో కేవలం 150 ఎకరాల్లోనే పంటలు సాగుచేశారు. కాళేశ్వరం 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్ జలాశయం ద్వారా ఈ మూడు మండలాల్లోని చెరువులు నింపాలి. మార్చిలో వరి పొట్టదశకు వస్తుంది. ఈ సమయంలో నీటి వినియోగం పెరుగుతుంది. నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చక ముందే గొలుసుకట్టు చెరువులను నింపుతూ చంద్రవంక ప్రాజెక్టులోకి నీటిని తరలించాలని ఆయా మండలాల రైతులు వారం క్రితమే జిల్లా నీటిపారుదల శాఖ ఇంజినీర్లకు మొరపెట్టుకున్నారు. 11వ ప్యాకేజీ డివిజన్ సిద్దిపేటలో ఉండటంతో నీటివిడుదల ప్రణాళిక మా పరిధిలోనిది కాదని చేతులెత్తేశారు. దీంతో రైతులు నాలుగు రోజులుగా సిద్దిపేట డివిజన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**అసంపూర్తి పనులతో అవస్థలు**

రంగనాయకసాగర్ జలాశయం నుంచి ఎల్–6 కాలువ ద్వారా జిల్లాలోని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళికలు చేశారు. ఇల్లంతకుంట మండలం దాచారం, తంగళ్లపల్లి మండలం జిల్లెల, ముస్తాబాద్ మండలం మొర్రాపూర్ వద్ద భూసేకరణ నిలిచిపోయింది. దీంతో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. భూసేకరణ జరిగి పనులు పూర్తయితే.. నర్సింహులపల్లి, బాలమల్లుపల్లి, బస్వాపూర్, రామన్నపల్లి, అంకుసాపూర్, లక్ష్మిపూర్, తాడూరు వరకు నీరందుతుంది.

విడుదల చేస్తాం– సీతారాములు, ప్యాకేజీ–11 ఈఈ



కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నాం. కొన్ని పనులు అసంపూర్తిగా ఉండటంతో వాగులు, వంకల ద్వారా గొలుసుకట్టు చెరువులను నింపుతూ రావాలంటే సమయం పడుతోంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు.

నీరొస్తే పంటచేతికొస్తుంది– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, అంకుసాపూర్, తంగళ్లపల్లి మండలం

వరిపంట చేతికందాలంటే రాబోయే నెలరోజులు కీలకమైన సమయం. రంగనాయకసాగర్ నుంచి పదిరోజులు నీటిని విడుదల చేస్తే గ్రామాల రైతులమంతా కలిసి గొలుసుకట్టు చెరువుల నుంచి ప్రాజెక్టును నింపుతాం. తక్కువ నీరు వదలడంతో ఎగువన ఉన్నరైతులే మళ్లించుకుంటున్నారు. ఆయకట్టుకు నీరందించేలా అధికారులు సహకరించాలి.

# వంద దాటిన పీఎం 10

హైదరాబాద్: కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల ప్రకారం ఘనపు మీటర్ గాలిలో పీఎం 10 సూక్ష్మ ధూళి కణాలు 60 మైక్రోగ్రాములు, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాల ప్రకారం 40 మైక్రోగ్రాములకు మించకూడదు. పీసీబీ తాజా నివేదిక ప్రకారం ఫిబ్రవరి మొదటి వారంలో జీడిమెట్ల, జూపార్కు, కోకాపేట్ ప్రాంతాల్లో 100 మైక్రోగ్రాములకు మించి నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది.

**దీర్ఘకాలంలో దుష్పరిణామాలు..**

పీఎం 10 సూక్ష్మ ధూళి కణాల పరిమితి పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. రహదారులపై రేగే దుమ్ము, చెత్త దహనం, పరిశ్రమలు, వాహనాలతో ఇవి ఎక్కువ పరిమితికి మించి నమోదవుతాయి. ఈ కాలుష్య కారకాలు దీర్ఘకాలం నమోదైతే తీవ్ర అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మానవ వెంట్రుక (50 నుంచి 70 మైక్రోమీటర్లు) కంటే పీఎం 10 ధూళి కణాలు



తక్కువ మందంతో (10 మైక్రోమీటర్లు) ఉంటాయి. శ్వాస పీల్చిన సమయంలో శరీరంలోకి వెళ్లి ఫ్రీ రాడికల్స్, యాంటీ యాక్సిడెంట్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. దీర్ఘకాలం కొనసాగితే జీవక్రియ ప్రభావితమై కొన్నాళ్లకు ఎముకలు గుల్లబారి పెలుసైపోయి అస్టియోపోరోసిస్ బారినపడే అవకాశం ఉంది. వీటితో పాటు తాత్కాలికంగా అలెర్జీలు, దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్లు ఎర్రబడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

# రహదారికి పచ్చదనం.. హాయిగా ప్రయాణం

బొంరాస్‌పేట : హైదరాబాద్–బీజాపూర్ 163వ నెంబరు జాతీయ రహదారి పచ్చని చెట్లతో కళకళలాడనుంది. దీని మీదుగా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు, ప్రయాణికులు మొక్కలు ఎదిగి వృక్షాలుగా మారి ఇచ్చే చల్లటి నీడ, వీచే చల్లటి గాలులతో సేదదీరనున్నారు.

**మన్నెగూడ నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు..**

జిల్లాలోని మన్నెగూడ నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డుకు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలు, పూల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం మీదుగా నేషనల్ హైవే ఉండడంతో మొక్కల పెంపకంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత ఏడాది నాటిన మొక్కలు ఇప్పటికే ఏపుగా పెరిగాయి.నెలల్లో ఇవి రహదారికి శోభను తేనున్నాయి.

**65 కిలో మీటర్లు, 43,000 మొక్కలు**

మన్నెగూడ నుంచి మన రాష్ట్ర సరిహద్దు వరకు 65 కిలోమీటర్ల దూరం మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. కిలో మీటరుకు 666 మొక్కల చొప్పున మొత్తం 43,290 మొక్కలను నాటారు. ఫెల్టోఫాం, గుల్‌మొహర్, నేరేడు, మామిడి వంటి నీడనిచ్చే మొక్కలను కూడా నాటారు. ఒక్కో వైపు మూడు వరుసల్లో వీటిని నాటగా వాటికి ముందు బిగ్నోనియా, బహూలియా వంటి రకరకాల పూల మొక్కలను కూడా పెంచుతున్నారు. వీటి సంరక్షణ బాధ్యతను హెచ్‌ఎండీఏకు అప్పగించారు. మొత్తం రహదారిని ఐదు భాగాలుగా విభజించి గుత్తేదార్లకు అప్పగించారు. ఎనిమిది నెలలపాటు వీరు అవెన్యూ ప్లాంటేషన్‌ను కాపాడే బాధ్యత తీసుకుంటారు. నిత్యం మొక్కలకు ట్యాంకర్లతో నీళ్లు పోయడం, పాదుల చుట్టూ కలుపు మొక్కలను తొలగించడం, చెట్లు ఏపుగా పెరగడం కోసం వాటి పక్కన పెరుగుతున్న కొమ్మలను కత్తిరించడం, చనిపోయిన వాటి స్థానంలో అంతే పొడవైన వాటిని నాటడం వంటి పనులు చేస్తున్నారు. ప్రభుత్వం ఇందుకోసం రూ.3 కోట్లను ఖర్చు చేస్తోంది.

**అవెన్యూ ప్లాంటేషన్‌ను కాపాడుతున్నాం**మన్నెగూడ నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా రూ.3 కోట్లతో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టి సంరక్షణ బాధ్యతను హెచ్‌ఎండీఏకు అప్పగించాం. నీడనిచ్చే మొక్కలతోపాటు పాటు పూల మొక్కలను నాటాం. ఏడాదిలో నేషనల్ హైవే పచ్చని చెట్లతో కళకళలాడనుంది. సత్యనారాయణమ్మ, రేంజ్ అధికారిణి, హెచ్‌ఎండీఏ.

# వేసవికి ముందే ట్యాంకర్లకు గిరాకీ

హైదరాబాద్: వేసవికి ముందే మహానగరంలో జలమండలి ట్యాంకర్లకు డిమాండ్ భారీగా పెరుగుతోంది. ఫిబ్రవరి మొదటి రెండు వారాల్లోనే గతేడాది కంటే 65 శాతం ట్యాంకర్ల బుకింగ్ పెరగడంతో జలమండలి అప్రమత్తమైంది. గతేడాది ఫిబ్రవరి మొదటి రెండు వారాల్లో 38,500 జలమండలి ట్యాంకర్లు సరఫరా చేయగా ఈ ఏడాది అదే సమయానికి ఏకంగా 63,700 ట్యాంకర్లు బుక్



అయ్యాయి.ఎక్కడెక్కడ బుకింగ్ ఎక్కువగా ఉందో గుర్తించి ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. భూగర్భజలాలు వేగంగా తగ్గిన ప్రాంతాల్లో బోర్లు ఎండిపోతుండటంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతున్నట్లు వెల్లడైంది. ప్రధానంగా కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, ఎస్సార్‌నగర్, మాదాపూర్‌తో పాటు శివారు ప్రాంతాల్లో బుకింగ్ పెరిగింది. ట్యాంకర్ డ్రైవర్లు అక్రమాలకు పాల్పడకుండా ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఇటీవల జలమండలి ఎండీ సమావేశమైనపుడు కూడా ట్యాంకర్ల అక్రమాలపై హెచ్చరించారు.


నిర్దేశిత గడువులోపు సరఫరా: ఎండీ ట్యాంకర్లను బుక్‌చేసుకుంటే నిర్దేశించిన గడువులోపు సరఫరా చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. గతేడాది ఫిబ్రవరి తొలి రెండు వారాల్లో నిర్దేశించిన గడువుకంటే 8వేల ట్యాంకర్లు ఆలస్యంగా సరఫరా అయినట్లు గుర్తించామన్నారు. ఈ సారి ట్యాంకర్లు 65 శాతం పెరిగినా నిర్దేశించి గడువుకంటే 240 ట్యాంకర్ల నీరు మాత్రం ఆలస్యంగా సరఫరా అయ్యాయన్నారు. ట్యాంకర్లు, ఫిల్లింగ్ పాయింట్లను పెంచినట్లు తెలిపారు.

## దిగువకు పాతాలగంగ

సిరిసిల్ల : జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. గత నెలతో పోలిస్తే జిల్లాలోని ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలాల్లో సగటున 2.45 నుంచి 1.54 మీటర్ల మేర దిగువకు పడిపోయాయి. జిల్లా భూగర్భ జలశాఖ తాజా నివేదిక దీనిని స్పష్టం చేస్తోంది. మరోవైపు గత నాలుగు రోజులుగా సగటున 36.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణం కంటే మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగాయి. పరిస్థితి ఇలానే కొనసాగితే మెట్టప్రాంతం కావడంతో భూగర్భజలాలు మరింత వేగంగా లోతుకు పడిపోయే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాలో యాసంగి వరి 1.77 లక్షల ఎకరాలు.. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, కూరగాయలు కలిపి నాలుగు వేల ఎకరాల్లో సాగయ్యాయి. గతేడాదితో పోల్చితే వరిసాగు 20 వేల ఎకరాలు పెరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వరి పంటకు ఈ రెండు నెలలు కీలకం. పొట్టదశలో కంకులు పాలుపోసుకుంటాయి. ఇప్పుడు నీటి తడులు ఎక్కువ అందిస్తే... దానికి తగ్గట్టుగా దిగుబడి పెరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అంత మేర నీటి లభ్యత కనిపించడం లేదు.

మధ్యమానేరులో 15.95 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇక్కడి నుంచి దిగువమానేరు, కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ జలాశయం నుంచి ఇల్లంతకుంట మండలంలోని చెరువులను నింపారు. ఎగువమానేరులోకి మల్లన్నసాగర్‌నుంచి గత నెలలో 0.5 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఆయా కాల్వల పరిధిలోని ఆయకట్టు మినహా మిగతా ప్రాంతమంతా బోరుబావులే ఆధారం. మెట్టప్రాంతం కావడంతో భూగర్భజలాలు వేగంగా తగ్గుతున్నాయి. దీని ప్రభావం సాగుచేసిన పంటలపై పడుతోంది. పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో బోరు బావుల నుంచి అన్నదాతలు



నిరంతరం నీటిని తోడుతున్నారు. ఈ ఏడాది తక్కువ రోజుల్లో ఎక్కువ వర్షాలు కురవడంతో భూగర్భంలోకి తక్కువ నీరు ఇంకింది. ఫలితంగా భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

నాకున్న 2.20 ఎకరాలకు తోడు పక్కనే ఉన్న మరో 2.20 ఎకరాలను కౌలుకు తీసుకుని మొత్తం వరి సాగు చేశా. ఇందులో రెండు వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. గత నెలరోజుల్లో రెండు బోరుబావుల్లో నీటి మట్టం పడిపోయింది. పొట్టదశ సమయంలో మూడెకరాలు పూర్తిగా ఎండిపోయింది. మిగిలిన రెండెకరాల్లో పంట పూర్తిగా చేతికొచ్చే పరిస్థితులు కనిపించడంలేదు. మాది మల్కపేట జలాశయం దిగువన కిలోమీటరు పరిధిలో ఉన్న గ్రామం. జలాశయంలో నీరు నింపితే చుట్టూ ఉన్న గ్రామాల్లో భూగర్భజలాలు నిలకడగా ఉండే అవకాశం ఉంది. పొన్నం లింగం, రైతు వెంకట్రావుపేట, కోనరావుపేట మండలం

## బాల బడులు.. కనీస వసతులు కరవు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూ ర్‌లోని బీసీ కాలనీలో మూడో అంగన్‌వాడీ కేంద్రం ఇది. ఇందులో 18 మంది చిన్నారులు ఉండగా 8 మంది గర్భిణులు, ఆరుగురు బాలింతలు లబ్ధిపొందుతున్నారు. సొంత భవనం ఉంది. శౌచాలయం ఉన్నా దానికి నీటి సరఫరా లేదు. కనీసం పిల్లలు గొంతు తడుపుకునేం దుకైనా తాగునీరు మృగ్యమైంది. బయట ఉన్న ట్యాంకు నుంచి బిందెలతో నీళ్లు తీసుకొస్తే చిన్నారులు చేతులు శుభ్రపరచుకోవాల్సిన పరిస్థితి. విద్యుత్తు సౌకర్యం లేదు. ఎండలు, ఉక్కపోత పెరుగుతున్న దృష్ట్యా తన సొంత ఖర్చులతో విద్యుత్తు తీగలను అమర్చి, ఫ్యాన్‌కు మరమ్మతు చేయించేందుకు ఇప్పటికే ఎలక్ట్రీషియన్‌తో మాట్లాడినట్లు అంగన్‌వాడీ టీచర్ జి.లావణ్య తెలిపారు.

**చిన్నారులకు తప్పని ఇబ్బందులు**


మాతా శిశుసంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, 0 నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోంది. కాగా పలు కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్)పరిధిలో మొత్తం 587 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. కొన్ని కేంద్రాలు సొంత భవనంలో నడుస్తుండగా మరికొన్ని అద్దె ఇళ్లు, పాఠశాలల గదుల్లో కొనసాగు తున్నాయి. అనేక కేంద్రాల్లో కనీస వసతులు మృగ్యమయ్యాయి. శౌచాలయాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. శౌచాలయాలున్న కేంద్రాల్లో నీటి సరఫరా లేకపోవడం వల్ల వాటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. అనేక కేంద్రాల్లో విద్యుత్తు కనెక్షన్లు,



ఫ్యాన్లు లేకపోవడంతో ప్రస్తుత వేసవిలో ఇబ్బంది పడుతున్నారు. గ్రామపంచాయతీల నుంచి 15 శాతం బడ్జెట్‌ను కేటాయించి అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాల్సి ఉన్నా, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల ఐసీడీఎస్ పరిధిలోని కేంద్రాల్లో 6 మాసాల నుంచి 3 సంవత్సరాల వయసు చిన్నారులు 18,838 మంది, 4020 మంది గర్భిణులు, 2533 మంది బాలింతలు, 15,374 మంది మూడు సంవత్సరాల నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలు లబ్ధిపొందుతున్నారు.

**సౌకర్యాలు కల్పించాలి** అంగన్‌వాడీ కేంద్రానికి పగటిపూట వెళుతున్నాం. అక్కడ శౌచాలయం నిరుపయోగంగా ఉంది. ఫ్యాన్ నడవకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బందిగా ఉంది. ఎండ తీవ్రత పెరగడంతో చిన్నారులు సైతం అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచి మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. వైష్ణవి, గర్భిణి, రాచర్ల బొప్పాపూర్

## నైపుణ్యాల పెంపునకు అడుగులు



మెదక్ : నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా టాటా సంస్థ సహకారంతో పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో అధునాతన సాంకేతిక కేంద్రాలను (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల ఐటీఐలకు మహర్దశ పట్టనుంది. జిల్లా పరిధిలో ప్రభుత్వ ఐటీఐ జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో కొనసాగుతోంది. మారిన పరిస్థితులు, పోటీ ప్రపంచం నేపథ్యంలో యువత నైపుణ్యాలను మెరుగుపరచాలన్నది సర్కారు లక్ష్యం. ఈ నేపథ్యంలోనే మెదక్ ఐటీఐకి ఏటీసీని మంజూరు చేసింది. కొత్త భవన నిర్మాణ పనులు హవేలిఘనపూర్‌లో మొదలయ్యాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కోర్సులను ప్రారంభించే అవకాశం ఉంది.

**ప్రభుత్వ పరిధిలో ఒకటే:** జిల్లాలో మొత్తం ఐటీఐ కళాశాలలు ఏడు ఉండగా, ప్రభుత్వ ఒకటి, ప్రైవేటువి ఆరు కొనసాగుతున్నాయి. వీటిల్లో 1,400 విద్యార్థులున్నారు. ప్రభుత్వ పరమైన ఐటీఐ కళాశాల ఒకటి మాత్రమే ఉంది. ఇది జిల్లా కేంద్రంలో ఉండగా, నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతు న్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఏటీసీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించడంతో ఈ నియోజకవర్గంలోని విద్యార్థుల ఆశలు చిగురించాయి. ఒక్కో ఏటీసీ కేంద్రానికి రూ.4.73 కోట్లు వెచ్చించను న్నారు. కంప్యూటరైజ్డ్ తరగతి గదులు, వర్క్‌షాపులు, ఎలక్ట్రిక్ వాహనాల టెస్టింగ్ సౌకర్యాన్ని సమకూర్చనున్నారు.

**ఉద్యోగ, ఉపాధి కల్పన:** కేంద్రంలో వివిధ నైపుణ్య కోర్సులు నేర్చుకున్న యువతకు టాటా సంస్థ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించనుంది. దేశంలోని ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో మంచి జీతభత్యాలు చెల్లించే ఉద్యోగాలకు ఆధునిక కోర్సులు చేసిన యువతను ఎంపిక చేసే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. టాటా సంస్థ సహకారంతో రూ.కోట్ల విలువైన ఆధునిక యంత్రాలు, పరికరాలు, కంప్యూటర్స్, ఇతర సామగ్రి, అవసరమైన వసతులు సమకూర్చ నున్నారు. **కోర్సులు :** మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, ఆర్టిసియన్ యూజింగ్, అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైయర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్.

**నిరుద్యోగ యువతకు వరం**

శ్రీనివాసులు, ప్రిన్సిపల్ మెదక్, ఐటీఐ

ఏటీసీలో ఇచ్చే ఆధునిక సాంకేతిక శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుంటే వరంలా ఉపయోగపడుతుంది. ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కోర్సులపై అవగాహన పెంచుకుని శిక్షణ పొందేందుకు ముందుకు రావాలి. పదో తరగతి చదివినవారే ఈ కోర్సులు చేసేందుకు అర్హులు. కొత్త ఏటీసీల ఏర్పాటుపై మార్గదర్శకాలు అందాల్సి ఉంది

## మేము చేయలేం.. ఉపాధి పనులు



తాంసి : ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేపట్టేందుకు మార్చి 31 చివరి గడువు. అప్పట్లోగా పనులు చేపట్టకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయి. నేటికీ సగానికి పైగా పనులు మొదలే కాలేదు. అసలు పనులు ప్రారంభమవుతాయో లేదో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

**రూ.32.93 కోట్లు**

ఉపాధి హామీ పథకం కింద ఏడాదంతా లేబర్‌వేజ్ కంపోనెంట్ కింద 60 శాతం, మెటీరియల్ కంపోనెంట్ కోసం 40 శాతం నిధులు ఖర్చు చేస్తారు. ఆర్థిక సంవత్సరం చివరిలో ఈ పనులు చేపడుతుంటారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.32.93 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో జిల్లా వ్యాప్తంగా 684 పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనుల్లో సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణంలో భాగంగా ఎక్కువ శాతం సీసీ రోడ్లు నిర్మిస్తుంటారు.

**నేటికి 254 పనులే ప్రారంభం..** ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు త్వరగా బిల్లులు రావనే ఉద్దేశంతో పాటు సోషల్ ఆడిట్ కింద మంజూరైన నిధుల్లో గతంలో 5 శాతం ఉంటే ఈసారి 10 శాతం కోత విధించడం, ఇసుక, కంకర, సిమెంట్ ధరలు పెరగడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. జిల్లాలో ఇంతవరకు 684 పనుల్లో 254 మాత్రమే ప్రారంభమయ్యాయి. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పనులు చేయాలంటూ జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులకు కబురు పంపుతున్నా.. చేయలేమంటూ వారు తప్పుకొంటున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో పనులు పూర్తి చేస్తారో లేదోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడువులోగా పూర్తి చేయిస్తాంశివరాం, ఈఈ పంచాయతీరాజ్ జిల్లాలో ఇంతవరకు 254 పనులు ప్రారంభమయ్యాయి. మిగతా పనులు కూడా త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించాం.

## రైతు వేదిక.. నిర్వహణ లేక..

నిర్మల్ : రైతు వేదికల నిర్వహణకు నిధుల్లేక నిస్తేజంగా మారుతున్నాయి. 30 నెలలుగా ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సదుపాయాలు లేక ఈ వేదికలకు వచ్చే అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కొంతమంది ఏఈవోలు తమ సొంత డబ్బులతో రైతు వేదిక నిర్వహణ చూసుకుంటున్నారు. రెండేళ్లకుపైగా విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో కనెక్షన్లు ఎప్పుడు తొలగిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

**ఆరంభంలో ఆర్భాటం**

నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. పంటల సాగుపై అన్నదాతలకు సూచనలు, సలహాలు, శిక్షణ తరగతుల నిర్వహణ, తదితర లక్ష్యాల కోసం వీటిని నెలకొల్పారు. ప్రతి 5 వేల మంది కర్షకులకు, రెండు నుంచి నాలుగు గ్రామాలకు కలిసి ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి వ్యవసాయశాఖ ద్వారా రూ.12 లక్షలు, ఉపాధిహామీ పథకం కింద రూ.10 లక్షలు వెచ్చించి నిర్మించారు. జిల్లాలో 79 క్లస్టర్లలో వీటిని నిర్మించి ఒక్కోదాని నిర్వహణకు ఒక ఏఈవోను నియమించారు. పంటల సాగుపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా వాటి నిర్వహణకు నిధుల్లేక ఏఈవోలకు భారంగా మారాయి.

**సమస్యలతో సతమతం**

ఒకే చోట రైతులు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నా.. జిల్లాలోని చాలా చోట్ల కనీస సౌకర్యాల్లేక ఉపయోగించడం లేదు. కొన్ని ఊరికి దూరంగా ఉండటంతో ఉపయోగం లేకుండా పోయాయి. వేదికను శుభ్రంగా ఉంచడానికి వీలుగా స్వీపర్లను నియమించలేదు. ఆరంభంలో తాగునీటి సౌకర్యం, విద్యుత్తు ఛార్జీలు, మరుగుదొడ్ల నిర్వహణకు నెలకు రూ.3 వేల కేటాయించింది. అవి సరిపోవని అధికారులు అప్పట్లో ప్రభుత్వం



దృష్టికి తీసుకెళ్లడంతో రూ.9 వేలు ఇచ్చారు. 2022 ఆగస్టు వరకు నిధులు వచ్చాయి. ఆ తర్వాత నిలిచిపోయాయి. కొందరు అధికారులు సొంత డబ్బులతో రైతు వేదికలను శుభ్రం చేయిస్తున్నారు. రైతులతో సమావేశం నిర్వహించినప్పుడు తాగునీటిని తెప్పిస్తున్నారు. ఉదాహరణకు నిర్మల్ మండలం ఎల్లపెల్లి క్లస్టర్ పరిధిలోని రైతు వేదికను కొత్త పోచంపాడ్ గ్రామ సమీపంలో నిర్మించారు. భైంసా మండలం మహాగావ్, దిలావర్‌పూర్‌లలో గ్రామ శివారులో రైతు వేదికలు నిర్మించడంతో ఉపయోగంలో లేకుండా పోతున్నాయి. మిగతా ప్రాంతాల్లో నీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ అక్కడి వచ్చిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి:**

రైతు వేదికల నిర్వహణకు 30 నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఏఈవోలు సొంత డబ్బు వెచ్చిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమావేశాల సమయంలో హాలును సిద్ధం చేయడం, కుర్చీలు వేయడం వంటి పనులకు అటెండర్లు లేక ఏఈవోలు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రతి రైతువేదికకు అటెండర్‌ను నియమించాలి. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి.

బానావత్ రాజ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏఈవోల సంఘం

## ఎల్ఆర్ఎస్!

ఆసిఫాబాద్ : అనధికార భూముల క్రమబద్ధీకరణకు అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్‌పై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తు దారులకు ఫోన్‌లు చేస్తూ సహకారం అందించేలా కలెక్టరేట్, పురపాలికల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 31 లోపు క్రమబద్ధీకరించుకుంటే 25 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కలెక్టర్, అదనపు కలెక్టర్లు సైతం క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితిని అంచనా వేస్తున్నారు. గత నెల నుంచి ప్రభుత్వ రాయితీ ప్రకటించడంతో స్పందన కనిపిస్తోంది.

**పుర పరిధిలో..**

జిల్లాలోని రెండు పురపాలికల పరిధిలో మొత్తం 3,529 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 92 మంది పూర్తి స్థాయిలో పత్రాలు సమర్పించలేదు. 15 తిరస్కరించారు. 311 మంది భూములకు సంబంధించి నిషేధిత జాబితాలో ఉన్నట్లు గుర్తించారు. మిగతా 3,027 మందికి ఫీజు చెల్లించాలని అధికారులు సమాచారమిచ్చారు. గత నెలలో 30 మంది మాత్రమే రూ.11 లక్షల వరకు చెల్లించి ధ్రువపత్రాలు పొందారు.



రాయితీ ప్రకటించడంతో.. ఆ సంఖ్య పెరుగుతోంది. తాజాగా 125 మంది రూ.27 లక్షల వరకు ఫీజు చెల్లించారు. వీరిలో 64 మందికి అధికారులు ప్రొసీడింగ్స్ అందించారు.

**సహాయ కేంద్రాల ఏర్పాటు**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో అన్ని సవ్యంగా ఉన్న వారి వివరాలను రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)కి పంపించారు. ఆ సర్వే నంబర్‌ల ఆధారంగా భూముల క్రమబద్ధీకరణకు అక్కడి నుంచి సమాచారమిస్తున్నారు. బల్దియాలు, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల నుంచి సిబ్బంది దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి చెబుతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో వార్డు ఆఫీసర్లు, కార్యదర్శులు సైతం ఫోన్లు చేసి రాయితీపై వివరిస్తున్నారు. 2020 ఆగస్టు 26కు ముందు భూములు కొని ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసిన వారు ఫీజును చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చు. అప్పుడు దరఖాస్తు చేయని వారు మాత్రం రిజిస్ట్రేషన్ కార్యాలయం వెళ్లి చేసుకునే అవకాశం కల్పించారు. ఉదాహరణకు.. గతంలో భూ యజమాని దరఖాస్తు చేసుకొని తరువాత మరొకరికి విక్రయించారు అనుకుంటే.. అలాంటి వారు ఏం చేయాలనే సందిగ్ధంలో ఉన్నారు. అయితే ఆ భూమి కొనుగోలు చేసిన వ్యక్తి తాజాగా క్రమబద్ధీకరించుకోవచ్చని, ఎల్ఆర్ఎస్ చెల్లించింది భూమికే కానీ వ్యక్తికి కాదని అధికారులు చెబుతున్నారు.

**పంచాయతీల్లో..** పంచాయతీల పరిధిలో మొత్తం 3,665 దరఖాస్తులు రాగా.. 2,299 దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని సమాచారమిచ్చారు. నెల కిందటి వరకు ఒక్కరూ చెల్లించలేదు. రాయితీ ప్రకటించాక ఇప్పటి వరకు 172 మంది రూ.25 లక్షల వరకు ఫీజు చెల్లించారు. దరఖాస్తు నిషేధిత జాబితాలో ఉన్నా, ఏదైనా కారణాలతో తిరస్కరించినా, పూర్తి స్థాయిలో ధ్రువపత్రాలు లేకపోయినా, అనుమతి ఇవ్వకుండా తిరస్కరిస్తే.. చెల్లించిన ఫీజులో 10 శాతం ప్రాసెసింగ్ ఫీజు తీసుకొని మిగతా మొత్తాన్ని దరఖాస్తుదారుడి ఖాతాల్లో జమ చేస్తారు.

## మత్స్యకారులకు ప్రోత్సాహం.. ఉపాధికి సహకారం

ఖమ్మం : చేపల పెంపకంపై ఆధారపడి జీవించే మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ఇటీవల పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా సంచార చేపల విక్రయ వాహనాన్ని అందజేశారు. దీని విలువ రూ.10 లక్షలు కాగా 60 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. మత్స్య సహకార సంఘాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు వీటిని మంజూరు చేస్తున్నారు. సంఘాల సభ్యులు కేవలం రూ.4 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది.

**వాహనంలో ప్రత్యేక వంటలు...**

చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఈ సంచార వాహనం ద్వారా ఉపాధి లభిస్తుంది. ఇదే వాహనంలో చేపలతో వివిధ రకాల వంటలు తయారు చేసే వెసులుబాటు ఉంటుంది. చేపల బిర్యానీ, ఫ్రై, కూర, చేపలతో పలు రకాల వంటలకు ఇది అనువుగా ఉంటుంది. ఇదే వాహనంలో బతికున్న చేపలను నిల్వ చేసుకుని తాజా వంటలను తయారు చేస్తారు. చేపలతో విలువ ఆధారిత ఉత్పత్తులను సైతం తయారు చేసుకునే అవకాశం ఉంటుంది. నగర, పట్టణ ప్రాంతాలు లేదా రద్దీగా ఉన్న ప్రాంతాలకు వాహనం తీసుకెళ్లి వంటలు చేసుకోవచ్చు. డిమాండ్ ఎక్కడ ఉంటే అక్కడకు వాహనం చేరుకునే అవకాశం ఉంటుంది.



**మరో రెండు వాహనాలకు ప్రతిపాదనలు...**

పాలేరు నియోజకవర్గంలో ఒక వాహనం పంపిణీ చేసిన తర్వాత ఇప్పుడు జిల్లా మత్స్యశాఖ అధికారులు ఖమ్మం, మధిర నియోజకవర్గాలకు రెండు అందజేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. స్వయం సహాయ సంఘాల వారు డీఆర్‌డీఓ అధికారులకు దరఖాస్తు చేస్తే అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చిన తర్వాత ఇవి మంజూరయ్యే అవకాశం ఉంది. ఇలా పలు ప్రాంతాల్లో మత్స్య ఉత్పత్తులను పరిచయం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం చికెన్ ధరలు పడిపోయిన తరుణంలో చేపలకు మంచి డిమాండ్ పెరిగింది. గతంలో కిలో రూ.100 నుంచి రూ.120 ధర ఉంటే ప్రస్తుతం రూ.140 నుంచి రూ.160 వరకు విక్రయిస్తున్నారు. దీనిపై ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. మత్స్యకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సంచార వాహనాలను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# తలసరి ఆదాయంలో పోటాపోటీ

ఖమ్మం: తలసరి ఆదాయం రూ.2 లక్షల మార్క్‌ను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు దాటేశాయని రాష్ట్ర గణాంకాల నివేదిక (2024) స్పష్టం చేసింది. తలసరి ఆదాయంలో రూ.9.54 లక్షలతో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉండగా.. 9, 10 స్థానాల్లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు నిలిచాయి. భద్రాద్రి జిల్లాలో రూ.2.58 లక్షలు, ఖమ్మం జిల్లాలో రూ.2.43 లక్షలుగా తలసరి ఆదాయం నమోదైంది. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.3.56 లక్షలు అని నివేదిక వెల్లడించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఇప్పటికీ అధిక (7,04,729) మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడుతున్నారని స్పష్టం చేసింది. వీరిలో 58.80 శాతం మంది వ్యవసాయ కూలీలు ఉన్నారని తెలిపింది. 92,404 ఎకరాల విస్తీర్ణంతో మిరప సాగులో ఖమ్మం జిల్లా తొలి స్థానంలో ఉండగా.. 29,778 ఎకరాల విస్తీర్ణంతో నాలుగో స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం నిలిచింది. పత్తి సాగులో వరుసగా ఏడు, ఎనిమిది స్థానాలను ఖమ్మం, భద్రాద్రి జిల్లాలు కైవసం చేసుకున్నాయి.

**'ఉపాధి'లో..** ఉపాధి హామీ కూలీలు నమోదైన జిల్లాల్లో ఖమ్మం జిల్లా రెండో స్థానంలో ఉంది. 6,42,495 మంది నమోదు చేసుకోగా.. వీరిలో 2,30,576 మంది ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో 4,58,842 మంది నమోదు చేసుకోగా 1,59,637 మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు.

**పారిశ్రామిక రంగంలో..**



రాష్ట్రంలో 10,368 పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. 758 పరిశ్రమలతో ఖమ్మం జిల్లా నాలుగో స్థానంలో ఉండగా 120 పరిశ్రమలతో భద్రాద్రి జిల్లా 19వ స్థానంలో నిలిచింది.

**రహదారి వ్యవస్థలో ఖమ్మం భేష్**

రహదారుల వ్యవస్థలో హైదరాబాద్, నల్గొండ జిల్లాల తర్వాత మూడోస్థానంలో ఖమ్మం జిల్లా నిలిచింది. ఖమ్మం జిల్లాలో 5,308.47 కి.మీ. మేర రహదారులు విస్తరించి ఉన్నాయి. జాతీయ రహదారులు- 210.73 కి.మీ., ఆర్అండ్‌బీ రోడ్లు- 3,684.78 కి.మీ, పంచాయతీ రాజ్ రహదారులు- 1,383.96 కి.మీ. పొడవు కలిగి ఉన్నాయి. 4,280.20కి.మీ. రహదారి కనెక్టివిటీతో భద్రాద్రి కొత్తగూడెం ఆరోస్థానంలో నిలిచింది. జాతీయ రహదారులు- 163.30 కి.మీ., ఆర్అండ్‌బీ రోడ్లు- 2,492.72 కి.మీ, పంచాయతీరాజ్ రహదారులు- 1,624.18 కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి.

**అక్షరాస్యతలో భద్రాద్రి ముందంజ**

రాష్ట్ర అక్షరాస్యత శాతం 66.50 ఉందని నివేదిక స్పష్టం చేసింది. భద్రాద్రి, ఖమ్మం జిల్లాలు వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి. భద్రాద్రి కొత్తగూడెంలో ఆరేళ్లలోపు వారు 9,61,632 మందికి 6,38,699 (66.41%) మంది, ఖమ్మం జిల్లాలో ఆరేళ్లలోపు వారు 12,62,025 మందికి 8,32,320(65.96%) మంది అక్షరాస్యులు ఉన్నారు. బడి బాటలోనూ రెండు జిల్లాలు భేష్ అనిపించాయి. ఉన్నత పాఠశాల స్థాయిలో రాష్ట్రంలోనే అత్యధికంగా డ్రాపవుట్స్ కలిగిన జిల్లాలో భద్రాద్రి కొత్తగూడెం (16.96 శాతంతో) 14వ స్థానాన్ని, ఖమ్మం (-0.05 శాతంతో) మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి.

# తప్పులు గుర్తించు.. తిప్పలు తప్పించు

కామారెడ్డి : జిల్లాకేంద్రానికి చెందిన నవీన్ 9వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థికి అపార్ గుర్తింపు సంఖ్య నమోదు కోసం ప్రయత్నించగా ఆధార్ కార్డులో పుట్టిన తేదీ తప్పుగా ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల నుంచి బోనఫైడ్ ధ్రువపత్రంతో తహసీల్దార్ కార్యాలయంలో పుట్టినతేదీ ధ్రువపత్రానికి దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థుల ప్రవేశాలు, పరీక్షలు, ఉపకార వేతనాలకు వివిధ ధ్రువపత్రాలు అవసరమవుతాయి. వీటిల్లో పొందుపరిచే వివరాలు సరిగా లేకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. కొందరు తల్లిదండ్రులు వారి పిల్లల పేర్లు, ఇంటిపేరు, పుట్టిన తేదీ వివరాలను సరిగా నమోదు చేయించడం లేదు. ఆధార్‌కార్డుల్లోనూ ఇష్టానుసారంగా పొందుపరుస్తున్నారు. చిన్నారులను పాఠశాలల్లో చేర్పించినప్పుడు కూడా వారి వివరాలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. చిన్నారులు జన్మించినప్పుడే వివరాలను స్పష్టంగా నమోదు చేయించాలి.

**ఇలా చేస్తే**

పుట్టినప్పుడు: చిన్నారులు జన్మించినప్పుడే పుట్టిన తేదీని నమోదు చేసుకోవాలి. బిడ్డ ఆసుపత్రిలో జన్మిస్తే సదరు ఆసుపత్రి వారు తమ బిడ్డ వివరాలను నమోదు చేసుకుంది లేనిది ఆరా తీయాలి. నామకరణం రోజున ఏం పేరు పెట్టాలో తల్లిదండ్రులు ముందే నిర్ణయించుకుంటారు. అయితే బిడ్డ పేరు, తల్లిదండ్రులు, ఇంటి పేర్లు తప్పులు లేకుండా రాసుకోవాలి.

**ఆధార్ నమోదుకు:** చిన్నారి ఆధార్ నమోదు కోసం వెళ్లినప్పుడు ఆధార్ కేంద్రం నిర్వాహకుడు వివరాల నమోదులో తప్పు చేసే అవకాశం ఉంది. వివరాలు పూర్తిగా చెప్పిన తర్వాత సబ్మిట్ చేసేముందు సరిగా ఉంది లేనిది తల్లిదండ్రులు చూసుకోవాలి. ఆ తర్వాతే సబ్మిట్ చేయాలి. **పాఠశాలలో ప్రవేశం వేళ:** చిన్నారులను పాఠశాలల్లో చేర్పించేటప్పుడు ఆధార్, ఇంటిపేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ వివరాలు సరిచూసుకోవాలి. పాఠశాల వారు దరఖాస్తు ఫారం ఇచ్చినప్పటికీ మనం పూరించిన వివరాలు పాఠశాల రికార్డులో సరిగా ఉన్నాయా లేవా గమనించి తప్పుగా ఉంటే వెంటనే మార్పించుకోవాలి. చిన్నారులు పాఠశాలకు వెళ్లడం ప్రారంభించగానే స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పుట్టిన తేదీ ధ్రువపత్రాన్ని తీసుకోవాలి. ఇందుకోసం మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

# అడుగడుగునా నిఘా. అక్రమాలకు అడ్డుకట్ట




పెద్దపల్లి : జిల్లాలో ఇసుక రవాణాపై ప్రభుత్వం నిఘా పెంచింది. అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయడానికి పోలీసు, గనుల శాఖ అధికారులను భాగస్వాములను చేసింది. ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతోంది. అధిక లోడు నియంత్రణకు రీచ్‌లలోని కాంటాల్లో తూకం వేసిన తర్వాతే అనుమతినిస్తున్నారు. రామగిరి మండలం కల్వచెర్లలో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అనుమానం ఉన్న వాహనాలను తూకం వేసి అధిక లోడ్ ఉంటే జరిమానా విధిస్తున్నారు.

**ఇతర ప్రాంత అధికారులకు బాధ్యతలు**

ముత్తారం మండలం జిల్లెల్లపల్లి(తాడిచెర్ల రీచ్-1), ఖమ్మంపల్లి(తాడిచెర్ల రీచ్-2)లో ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రీచ్‌ల పర్యవేక్షణ బాధ్యతలను ఇతర జిల్లాలకు చెందిన రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(టీఎస్ఎండీసీ) అధికారులతో పాటు గనుల శాఖ అధికారులకు కేటాయించారు. మంథని మండలం గోపాల్‌పూర్ రీచ్ ఇసుక నిల్వ కేంద్రంలో జనగామ జిల్లాకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్ విజయ, జిల్లెల్లపల్లిలో పెద్దపల్లి గనుల శాఖ ఆర్ఐ వెంకటగిరి, ఖమ్మంపల్లిలో ఆర్ఐ రేణుకలకు బాధ్యతలు అప్పగించారు. ఇసుక తవ్వకాలు, నిల్వ కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించారు. హైదరాబాద్ నుంచి టీఎస్ఎండీసీ, గనుల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ ఆధారంగా రవాణా చేస్తుండటంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది.

**పరిమితి మించితే జరిమానా**

లారీల్లో నిర్ణీత పరిమాణం కంటే 50 కిలోలు ఎక్కువ నింపినా జరిమానా విధిస్తున్నారు. ఇసుక నిల్వ కేంద్రంలో సీసీ కెమెరాలను పరిశీలించి మరోసారి తూకం చేస్తున్నారు. గతంలో ఒక్కో లారీలో దాదాపు రూ.3 వేల విలువను ఇసుకను అదనంగా తరలించేవారు. ప్రస్తుతం కిలో ఎక్కువగా ఉన్నా ఉపేక్షించడం లేదు. లారీల్లో అదనంగా తరలించేందుకు బిగించిన ఎత్తు రేకులను తొలగించుకోవాలని నిర్వాహకులు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఆన్‌లైన్ రసీదు లేకుండా రవాణా జరిగేది. నిఘా పటిష్ఠం చేయడంతో బోగస్ దందాకు అడ్డుకట్ట పడింది.

**నిరంతర పర్యవేక్షణ**

ఇసుక రీచ్‌లలో తవ్వకాలు, రవాణాపై వారం రోజులుగా రాష్ట్ర స్థాయిలో విస్తృతంగా పర్యవేక్షిస్తున్నారు. గనుల శాఖ ముఖ్య కార్యదర్శి, టీఎస్ఎండీసీ వైస్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్లు, అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. రోజుకు ఎంత తవ్వకాలు జరిపారు? ఎన్ని లారీల్లో ఎన్ని టన్నులు తరలించారు? అన్న విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. త్వరలో రీచ్‌లలోని సీసీ కెమెరాలను కలెక్టరేట్‌తో, అనంతరం హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించనున్నారు.

**గతంలో దందా సాగిందిలా..**

గతంలో ఇసుక గుత్తేదారులు ఆడిందే ఆటగా ఎలాంటి వే బిల్లులు లేకుండా జీరో దందా సాగించారు.

16 టైర్ల వాహనాల్లో 35 టన్నులు, 14 టైర్ల వాహనాల్లో 32 టన్నులు, 12 టైర్ల వాహనాల్లో 26 టన్నుల ఇసుక నింపాల్సి ఉండగా అదనంగా నింపి తరలించేవారు.

అక్రమాలు గుర్తించినప్పటికీ నామమాత్రంగా కేసులు నమోదు చేసి, జరిమానా విధించేవారు.

ఆన్‌లైన్ విధానం అమలులో ఉన్నా అడ్డూ అదుపూ లేకుండా అక్రమ రవాణా సాగింది.

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఒక్కో రీచ్‌లో రూ.కోట్ల ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైంది.

# కొత్త కోర్సులతోనే భవిత



సిరిసిల్ల : ఇటీవల దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా జరిగిన ఒప్పందాల్లో రాష్ట్రంలో ద్వితీయశ్రేణి పట్టణాల్లోనూ డేటా కేంద్రాల ఏర్పాటుకు సిఫీ టెక్నాలజీస్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు జేఎన్‌టీయూ, ఏడు ప్రైవేటు కళాశాలలుండగా సాంకేతిక విద్యను అందిపుచ్చుకుంటే రాబోయే రోజుల్లో వీటిలో ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు కలిసివస్తాయి.

ఉమ్మడి జిల్లాలో కొండగట్టు, మంథని, సిరిసిల్ల జేఎన్‌టీయూల్లోని 16 విభాగాల్లో ఏటా 1034 మంది విద్యార్థులు చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతుండగా వీరిలో 70శాతం మంది ఉత్తీర్ణులవుతున్నారు. ప్రాంగణ నియామకాల్లో మాత్రం వెనకబడిపోతున్నారు. ఈ నేపథ్యంలో బీటెక్ తృతీయ సంవత్సరంలో అదనపు నైపుణ్యాలపై దృష్టి పెట్టాలంటున్నారు నిపుణులు.

కంప్యూటర్స్ విభాగంలో సీ, సీప్లస్‌ప్లస్, జావా, పైథాన్ వంటి కోర్సులు పాతబడిపోయాయి. ప్రస్తుతం ఎమర్జింగ్ టెక్నాలజీస్, సర్వీస్ నౌ, పెగా, ఏడబ్ల్యూఎస్, క్లౌడ్ వంటి సర్టిఫికెట్ కోర్సులతో పాటు ఆంగ్లంలో పట్టు సాధించి, విదేశీ భాషలు చేర్చుకోవాలి. అప్పుడే ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యే అవకాశముంది.

మంథని, కొండగట్టు కళాశాలల్లో సీఎస్ఈ, సీఎస్ఎం (ఏఐ మిషన్‌లర్నింగ్), ఐటీలో సైబర్ సెక్యూరిటీ కోర్సులు ప్రత్యేకంగా ఉన్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్. డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలను అన్ని రంగాల్లో విరివిగా వినియోగిస్తున్నారు. వీటికి టూల్స్ వాడతారు. టూల్స్ తెలియాలంటే ఎమర్జింగ్ టెక్నాలజీ కోర్సులు నేర్చుకోవాలి. అలాగే ఆయా రంగాల్లో వస్తున్న మార్పులు గమనిస్తూ ఉండాలి.

మూడు కళాశాలల్లో ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ సెల్ లేదు. దీనికోసం కళాశాలలోనే సీనియర్ ఫ్యాకల్టీ ఒకరికి బాధ్యతలు అప్పగించారు. వీరు హైదరాబాద్ జేఎన్‌టీయూలో నిర్వహించే ప్రాంగణ నియామకాలకు విద్యార్థులను పంపుతున్నారు. అక్కడి వారు ఇతర ప్రాంతాల విద్యార్థుల పట్ల విముఖత చూపడంతో ఇక్కడి విద్యార్థులు ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం -సంజయ్, మెకానికల్**

ప్రాంగణ నియామకాల కోసం హైదరాబాద్ వెళ్లి ముఖాముఖికి హాజరు కావాలంటే ఇబ్బందులు పడుతున్నాం. మా కళాశాలకు అటానమస్ హోదా ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని మూడు జేఎన్‌టీయూ కళాశాలలకు కలిపి ఏటా ఒక కళాశాలలో ప్రాంగణ నియామకాలు జరిపించేలా చూడాలి. ఈ విషయమై ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టి సారించాలి.

**అవసరమైన నైపుణ్యాలతో మేలు-అయ్యప్ప, ఈసీఈ**

ప్రాంగణ నియామకాల సమయంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నగరాల్లో చదివిన వారికి చాలా వ్యత్యాసం ఉంటోంది. అక్కడి వారు సబ్జెక్టులతో పాటు ప్రైవేటుగా శిక్షణ తీసుకుంటూ కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారు. ఇక్కడి కళాశాలల్లోనే ప్రత్యేక కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలి. **మార్కులు ప్రామాణికం కాదు- ప్రభాకర్, ప్రిన్సిపల్, జేఎన్‌టీయూ, కొండగట్టు** ఇంజినీరింగ్ విద్యార్థులకు అకడమిక్ మార్కులు ప్రామాణికం కాదు. ఇవి ఉద్యోగాలు సాధించిపెట్టవు. ఆయా రంగాల్లో మార్పులను గమనిస్తూ తగిన సర్టిఫికెట్ కోర్సులు నేర్చుకోవాలి. కనీసం మూడు కోర్సులైనా చేసి నైపుణ్యం సాధించి ఉండాలి. జేఎన్‌టీయూలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

# అమ్మవారి చెంత.. వసూళ్ల దందా

వేములవాడ: ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా ముందుగా ఇక్కడి భక్తులు బద్ది పోచమ్మకు మొక్కు ముట్టజెప్పడం ఆనవాయితీగా వస్తోంది. కాగా ఆలయంలోని కొంత మందికి ఇది వరంగా మారింది. మొక్కు చెల్లించుకోవాలని వెళ్లే భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. బోనం నైవేద్యం, బెల్లంసాక సమర్పించడంతో పాటు పట్నం వేయడం వంటి మొక్కులు చెల్లించుకుంటారు. వీటితో పాటు అమ్మవారికి ఒడి బియ్యం, తొట్టె కట్టుట, చీర సమర్పణ వంటి మొక్కులను భక్తులు ఉచితంగా చెల్లించుకునే అవకాశం ఉండగా కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మంగళ, ఆదివారాల్లో వేల సంఖ్యలో భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు. ఇదే అదనుగా ఆలయంలో విధులు నిర్వహించే కొందరు సిబ్బంది అక్రమ మార్గాల్లో భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పట్నాల మొక్కులు చెల్లించుకునే చోట రూ.1500 నుంచి రూ.2 వేల వరకు దండుకుంటున్నారని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టికెట్టు ధర ఒకటి ఉంటే చెల్లింపులు అదనంగా చేయాలని కొందరు సిబ్బంది డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అడిగినంత డబ్బులు ఇచ్చుకుంటేనే మొక్కు పూర్తవుతుందని.. లేదంటే మొక్కు వాయిదా వేసుకోవల్సిన పరిస్థితి నెలకొందని భక్తులు అంటున్నారు. ఆలయంలో అడుగడుగునా అక్రమంగా వసూళ్లు జరుగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని చెబుతున్నారు. ఇప్పటికైనా అక్రమ దందాకు అడ్డుకట్టవేయాలని కోరుతున్నారు. డబ్బులు వసూలు చేస్తే చర్యలు-వినోద్‌రెడ్డి. ఈవో రాజన్న ఆలయం వేములవాడ మొక్కులు చెల్లించుకునే భక్తుల వద్ద సిబ్బంది డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు. బద్ది పోచమ్మ ఆలయంలో పట్నాలు వేసే వ్యక్తులు భక్తుల వద్ద ఎక్కువ డబ్బులు వసూలు చేసినట్లు ఇటీవల మా దృష్టికి వచ్చింది. డబ్బులు తిరిగి భక్తులకు ఇప్పించాము. ఆలయంపై ప్రత్యేక దృష్టి సారించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం.

# ఈవీ లీవీగా..!

ఖమ్మం : డీజిల్, పెట్రోల్ వాహనాలతో కాలుష్యం పెరిగిపోతోంది. అందుకే పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొన్నేళ్లుగా ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) జోరు ఊపందుకుంది. ఖమ్మం జిల్లాలో 2022లో 322, 2023లో 863, 2024లో 1,641 ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లు జరగటం గమనార్హం.

**ప్రోత్సాహకాలు.. రాయితీలు**

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేందుకు ప్రోత్సాహకాలు, రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గతంలో కేంద్ర ప్రభుత్వం సైతం రాయితీలు కల్పించింది. ఎలక్ట్రిక్ వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తోంది. రోడ్డు, జీవితకాల పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చింది. గతంలో 100సీసీ ఇంజిన్ సామర్థ్యం గల ద్విచక్రవాహనాలకు మాత్రమే ఈ సదుపాయం ఉండేది. ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకూ రాయితీలను 2026 డిసెంబర్ 31 వరకు వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఓ వ్యక్తి రెండో వాహనం కొంటే 2% పన్ను విధించేది. రెండో వాహనం ఎలక్ట్రిక్ వాహనం(ఈవీ) అయితే అదనపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.



**ఛార్జింగ్ స్టేషన్లతో మరింత మెరుగు**

ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు, కార్లకు ఇంట్లోనే ఛార్జింగ్ పెట్టుకునేలా డిజైన్లను వాహన తయారీ సంస్థలు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. దూర ప్రాంతాలకు వెళితే ఛార్జింగ్ కారణంగా కొంత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. గతంలో టీజీరెడ్‌కో(రెన్యుబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొన్నిచోట్ల ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలు రూపొందించారు. స్థలాలను అన్వేషించారు. అయితే ఇప్పటివరకు ఎక్కడా ఒక్క ఛార్జింగ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టలేదు. టీజీఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కేటగిరీ-9 కింద పెట్రోల్ బంకుల్లో ఎలక్ట్రిక్ వాహనాలకు ఛార్జింగ్ పెట్టుకునేలా కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ ప్రక్రియ ఉభయ జిల్లాల్లో కొనసాగుతోంది.

ఖమ్మంలోని బైపాస్ రోడ్డు, కొన్ని పెట్రోల్ బంకులు, సత్తుపల్లి మండలం కిష్టారంలో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశారు. కొణిజర్ల మండలం తుమ్మలపల్లి, పెద్దగోపతి, వైరా పట్టణం, వైరా మండలం పినపాక, సత్తుపల్లిలో ఛార్జింగ్ స్టేషన్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భద్రాద్రి జిల్లాలోనూ కొన్నిచోట్ల పనులు జరుగుతున్నాయని విద్యుత్తు సంస్థ అధికారులు తెలిపారు. ఇదే పంథాను కొనసాగిస్తూ ఛార్జింగ్ స్టేషన్లను పెంచితే ఉభయ జిల్లాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మరింత పెరగనుంది.

2022 నుంచి 2024 వరకు.. ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లు

ఖమ్మం: 2,826

భద్రాద్రి: 1,469

పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఖమ్మం జిల్లాలో మూడేళ్లుగా 'ఈవీ'ల రిజిస్ట్రేషన్లు క్రమేణా పెరిగాయి.

వి.వెంకటరమణ, జిల్లా ఇన్‌ఛార్జి రవాణాశాఖ అధికారి, ఖమ్మం

# కొంత ప్రగతి.. స్వల్ప వృద్ధి

కామారెడ్డి : రాష్ట్ర సగటుతో పోలిస్తే ఉమ్మడి జిల్లా విద్య, వైద్యం, పారిశ్రామిక, ఉపాధి రంగాల్లో వెనుకబడి ఉంది. గతేడాది కన్నా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయంలో పెరుగుదల ఉంది. పలు రంగాల్లో కొంచెం మోదం..కొంచెం ఖేదం అనేలా ఫలితాలను చూపించింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2024- రాష్ట్ర స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్(అట్లాస్) నివేదిక ప్రకారం ఉమ్మడి జిల్లా ప్రగతి ప్రస్థానంపై ప్రత్యేక కథనం..

**తలసరి స్వల్పమే**

ఒక సంవత్సర కాలంలో ఒక వ్యక్తి ఆర్జించే ఆదాయాన్ని తలసరి ఆదాయం అంటారు. ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని బట్టి తలసరి ఆదాయాన్ని లెక్కిస్తారు. జిల్లా పరిధిలో ఏడాది మొత్తంలో జీఎస్‌డీపీని జనాభాతో భాగిస్తే వచ్చిన మొత్తాన్ని జిల్లా పౌరుడి తలసరి ఆదాయంగా గణిస్తారు. గతంతో పోలిస్తే కొంత మెరుగ్గా ఉన్నా ఇంకా మెరుగుపడాలల్సి ఉంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,56,564 ఉండగా నిజామాబాద్ రూ.1,96,185తో 26వ స్థానంలో, కామారెడ్డి రూ.1,89,588తో 30వ స్థానంలో ఉన్నాయి.

**ఉపాధి అంతంతే**

ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని లెక్కగట్టడానికి తలసరి ఆదాయం చక్కటి కొలమానం. 20-21ఆర్థిక సంవత్సరం నుంచి ఉభయ జిల్లాల్లో తలసరి ఆదాయం క్రమేపి పెరుగుతూ వస్తోంది. మూడేళ్లుగా ఉభయ జిల్లాల స్థూల జిల్లా జాతీయోత్పత్తి ధరల పెరుగుదలకు అనుగుణంగా పెరగని పరిస్థితి. ప్రధానంగా రెండు జిల్లాల్లో పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాలు లేకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

**స్థూల జిల్లా జాతీయోత్పత్తి**

ప్రాంత అభివృద్ధికి స్థూల జిల్లా జాతీయ ఉత్పత్తి(జీడీడీపీ)ని కొలమానం. ఏడాదిలో జిల్లాలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవలు, కొనుగోలు సేవలను జీడీడీపీగా పరిగణిస్తుంటారు. వినిమయం, పెట్టుబడి, ప్రభుత్వ వ్యయంతో పాటు ఎగుమతులు, దిగుమతుల మధ్య తేడా తదితర వాటిని లెక్కలోకి తీసుకుంటారు. భవిష్యత్తు ప్రణాళికలను నిర్ణయించడానికి జీడీడీపీని కొలమానంగా భావిస్తారు. రాష్ట్రంలో జీడీడీపీలో నిజామాబాద్ జిల్లా ఏడు, కామారెడ్డి 18వ స్థానంలో ఉన్నాయి. **లింగనిష్పత్తి అంతంతే**

ఉభయ జిల్లాల్లో లింగనిష్పత్తి ఆందోళనకరంగా ఉంది. ప్రతి వెయ్యి మంది బాలురకు కామారెడ్డిలో 941, నిజామాబాద్‌లో 963 మంది బాలికలున్నారు. లింగనిర్ధారణ పరీక్షలను అరికట్టకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.



# డీలిమిటేషన్‌తో రాజకీయ అధికారాలను కోల్పోతాం..!

చెన్నై: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం శనివారం ప్రారంభమైంది. ఇందులో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడారు. జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల రూపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతుందని ఆరోపించారు. సొంత దేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతామని అన్నారు. "డీలిమిటేషన్‌పై ఈ అఖిలపక్ష భేటీ చరిత్రాత్మకంగా నిలిచిపోతుంది. ప్రస్తుతమున్న జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరగకూడదు. దీన్ని మనమంతా వ్యతిరేకించాలి. పార్లమెంట్‌లో మన ప్రాతినిధ్యం పడిపోతే.. అభిప్రాయాలను వ్యక్తీకరించే బలం తగ్గుతుంది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల కోసం మనం పోరాటం చేయాల్సి వస్తుంది. మన సమ్మతితో సంబంధం లేకుండానే చట్టాలు రూపొందుతాయి. ఆ నిర్ణయాలు మన ప్రజలపై ప్రభావం చూపుతాయి. విద్యార్థులు అవకాశాలు కోల్పోవాల్సి వస్తుంది. రైతులకు మద్దతు కొరవడుతుంది. మన సంప్రదాయాలు, వృద్ధి ప్రమాదంలో పడతాయి. సామాజిక న్యాయం దెబ్బతింటుంది. ఈ పరిణామాలన్నింటితో మన సొంత దేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతాం" అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

**భారతదేశాన్ని కాపాడేందుకు ప్రయత్నాలు: స్టాలిన్...** తమ నిరసన పునర్విభజనకు వ్యతిరేకంగా కాదని స్టాలిన్ ఈ సందర్భంగా వెల్లడించారు. న్యాయబద్ధంగా, పారదర్శకంగా డీలిమిటేషన్ చేయాలనే తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తాజా భేటీని 'జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్'గా పిలుద్దామని తమిళనాడు సీఎం ప్రతిపాదించారు. అంతకుముందు తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. "జనాభా పెరుగుదలను అరికట్టేందుకు కొన్ని దశాబ్దాలుగా పలు దక్షిణాది రాష్ట్రాలు కీలక చర్యలు చేపడుతున్నాయి. ఇందుకోసం అనేక విధానాలు కూడా తీసుకొచ్చాం. కానీ, కొన్ని రాష్ట్రాల్లో మాత్రం జనాభా వృద్ధి విపరీతంగా ఉంది. జనాభా నియంత్రణపై మన చర్యలకు ఎలాంటి రివార్డ్ లభించలేదు సరికదా.. ఇప్పుడు రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయే ప్రమాదంలో పడ్డాం" అని అన్నారు.

**పునర్విభజన మనకు డేంజర్ బెల్: పినరయి విజయన్...** ఈసందర్భంగా కేరళ సీఎం పినరయి విజయన్ మాట్లాడుతూ.. "ఎలాంటి చర్చలు చేపట్టకుండానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని కేంద్రం భావిస్తోంది. అలా జరిగితే అది మనకు డేంజర్ బెల్ లాంటిదే. పార్లమెంట్‌లో మన ప్రాతినిధ్యం తగ్గితే.. దేశ సంపదలో మన వాటా కూడా తగ్గుతుంది. దీన్ని మనం ఎన్నటికీ అనుమతించకూడదు" అని అన్నారు. చెన్నై వేదికగా తమిళనాడు సీఎం స్టాలిన్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఈ సదస్సుకు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విపక్ష నేతలు హాజరయ్యారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొన్నారు.



# ఆ రంగాల్లో వారానికి 90 గంటలు పనిచేస్తున్నారు

## నారాయణమూర్తి 70 గంటల పని వ్యాఖ్యలపై స్పందించిన సుధామూర్తి

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఇటీవల పని గంటలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ఆయన భార్య, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి స్పందించారు. ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే సమయం ఎప్పుడూ పరిమితంగా మారదని ఆమె వ్యాఖ్యానించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. 'ప్రజలు ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే దానికి సమయం ఎప్పుడు పరిమితిగా మారదు. నా భర్త డబ్బులు లేని సమయంలో కూడా ఇన్ఫోసిస్ (%×అటశీంఎం%)ను నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు అంకితభావం కలిగిన వ్యక్తులతో కలిసి 70 గంటలు అంతకంటే ఎక్కువ సమయం పని చేయడం వల్లే అది సాధ్యమైంది. నా భర్త మాత్రమే కాదు.. జర్నలిస్టులు, డాక్టర్లు వంటి ఇతర రంగాల్లోని వారు కూడా 90 గంటలు పని చేస్తున్నారు. భగవంతుడు అందరికీ రోజుకి 24 గంటల సమయమే ఇచ్చాడు. దానిని మీరు ఎలా వినియోగించుకుంటారు అనేది మీ ఇష్టం' అని సుధామూర్తి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె వ్యక్తిగత జీవితం గురించి కూడా మాట్లాడారు. నారాయణమూర్తి ఇన్ఫోసిస్‌ను చూసుకున్నప్పుడు తాను ఇంటి బాధ్యతలు తీసుకున్నానని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తాను ఇంటిని చూసుకోవడం, పిల్లలను పెంచడంతో పాటు కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను తన భర్త కంటే ఓవర్‌టైమ్ పని చేస్తున్నానని, దానికి ఆయన వెనక నుంచి సపోర్ట్‌గా ఉండి ముందుకు నడిపిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి మహిళ విజయం వెనక అర్థం చేసుకునే వ్యక్తి ఉంటారని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా వృత్తి జీవితంలో భార్యాభర్తలు ఒకరికొకరు సాయం చేసుకోవాలని అదే జీవితమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కొందరు దీన్ని సమర్థించగా.. మరికొందరు వ్యతిరేకించారు. వారానికి 90 గంటల పాటు పనిచేయాలంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలూ నెట్టింట చర్చకు దారితీశాయి.

# గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదు: పవన్ కల్యాణ్



పూడిచర్ల: సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలను పటిష్ఠం చేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన నాయకత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు జిల్లా పూడిచర్లలో పంట కుంట నిర్మాణానికి పవన్ భూమిపూజ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల పంట కుంటల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బలమైన, అనుభవజ్ఞులైన సీఎం ఉండబట్టే పల్లె పండుగ విజయవంతమైందన్నారు. "గెలుపులోనే మనుషులను లెక్కించం.. కష్ట సమయంలోనూ ఎలా ఉన్నారనే చూస్తాం. కష్ట సమయంలో బలంగా నిలబడినందునే విజయం సాధించాం. ఈ విజయం రాష్ట్ర ప్రజలు, యువత, మహిళలకు దక్కుతుంది. కర్నూలు జిల్లాలో రూ.75 కోట్లతో 117 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం చేశాం. జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా 98 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయింది. నీటిని నిల్వ చేసుకోగలిగితే ఎలాంటి సమస్య ఉండదు. వర్షాలు రాగానే పంట కుంటలు నిండేలా ప్రణాళికలు చేస్తాం. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదు. వాటిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ కింద సొంత గ్రామాల్లోనే పనులు కల్పించాం. ఉపాధిహామీ కింద ఇప్పటి వరకు రూ.9,597 కోట్లు ఖర్చు చేశాం. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యం. వంద మందికిపైగా నివసిస్తున్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించాం. విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులకు నిధులు కేటాయించాం" అని పవన్ అన్నారు.



# ఆ 5 లక్షల మందికి నివాస హోదా రద్దు..!

మియామీ: అగ్రరాజ్య అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి వలసల విషయంలో అమెరికా సర్కారు దూకుడు నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి వారిని దేశం నుంచి పంపిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా తాత్కాలిక వలసదారులపైనా ట్రంప్ కన్నెర్ర చేశారు. యూఎస్ వ్యాప్తంగా 5 లక్షల మందికి పైగా వలసదారులకు తాత్కాలిక నివాస హోదాను రద్దు చేస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ సంచలన ప్రకటన చేసింది. క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజువెలా దేశాలకు చెందిన లక్షలాది మంది వలసదారులకు చట్టపరమైన రక్షణను రద్దు చేస్తున్నట్లు హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది. నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్లు తెలిపింది. 2022 అక్టోబరు తర్వాత ఆ నాలుగు దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చిన దాదాపు 5,32,000 మందికి ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి. మానవాత పెరోల్ కార్యక్రమం కింద అమెరికాకు వచ్చిన వారిపై ఈ కొత్త విధానం ప్రభావం చూపనుంది. వీరంతా ఇతరుల ఆర్థిక సహకారంతో అమెరికాకు వచ్చారని, రెండేళ్ల పాటు యూఎస్‌లో నివసించడానికి, పని చేయడానికి తాత్కాలిక అనుమతులు పొందారని హోమ్‌లాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు. వీరు ఏప్రిల్ 24న లేదా ఫెడరల్ రిజిస్టర్‌లో నోటీసులు ప్రచురించిన 30 రోజుల తర్వాత అగ్రరాజ్యంలో ఉండేందుకు లభించిన లీగల్ స్టేటస్‌ను కోల్పోనున్నారని తెలిపారు. మానవతా పెరోల్‌ను విస్తృతంగా దుర్వినియోగం చేస్తున్నారని, దీనికి ముగింపు పలుకుతామని ట్రంప్ ఇదివరకే వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా తాజాగా అమెరికా సర్కారు చర్యలు చేపట్టింది. ఈ మానవతా పెరోల్ అనేది అమెరికాలో సుదీర్ఘకాలంగా ఉన్న వెసులుబాటు. యుద్ధం లేదా రాజకీయ అస్థిరత ఉన్న దేశాల ప్రజలు అమెరికాకు వచ్చి తాత్కాలికంగా నివాసం ఉండేందుకు వీలుగా అధ్యక్షుడు ఈ లీగల్ స్టేటస్‌ను కల్పిస్తారు. గతేడాది అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ దీని గురించి పలుమార్లు ప్రస్తావించారు. అక్రమ వలసదారులను బహిష్కరించడంతో పాటు కొందరు వలసదారులకు ఉన్న చట్టబద్ధమైన మార్గాలను కూడా ముగిస్తామని అప్పట్లో తెలిపారు. అంతక్రితం ఉన్న నిబంధనల ప్రకారం.. ఇలా మానవతా పెరోల్ కింద అమెరికాకు వచ్చే వారు రెండేళ్ల పాటు చట్టబద్ధంగా దేశంలో ఉపాధి పొందొచ్చు. ఆ గడువు ముగిసిన తర్వాత మరింత ఎక్కువ కాలం ఉండేందుకు వీలుగా శరణార్థిగా లేదా వీసా కోసం దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉండేది. అయితే, ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేశారు. దీన్ని సవాల్ చేస్తూ పలు ఫెడరల్ కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి.

# పునర్విభజనపై జగన్, షర్మిల ఏమన్నారంటే





అమరావతి, మార్చి 22: డీలిమిటేషన్‌పై ఓ వైపు దక్షిణాది రాష్ట్రాల సమావేశం జరుగుతుండగా.. మరోవైపు ఇదే అంశంపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి స్పందించారు. డీలిమిటేషన్‌లో అన్యాయం జరుగకుండా చూడాలని జగన్ కోరగా.. డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలది రాజకీయం కాదని.. ప్రజల హక్కుల కోసం చేసే పోరాటమని, జనాభా ప్రాతిపదికన పునర్విభజనను అంగీకరించే ప్రసక్తే లేదని వైఎస్ షర్మిల చెప్పుకొచ్చారు.

**ప్రధానికి జగన్ లేఖ..** డీలిమిటేషన్‌పై ప్రధాని నరేంద్ర మోదీకి జగన్ లేఖ రాశారు. పార్లమెంటు నియోజకవర్గాల డీలిమిటేషన్‌లో అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ఏ ఒక్క రాష్ట్రంలోనూ లోకసభ, రాజ్యసభ స్థానాలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశం మేరకు డీఎంకే పార్టీ నాయకులకు వైఎస్ఆర్సీపీ పార్లమెంటరీ లీడర్ వి సుబ్బారెడ్డి లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజనలో ఫెయిర్ అండ్ బ్యాలెన్స్ విధానం ఆచరించాలని లేఖలో వెల్లడించారు.

**సొమ్ము సౌత్ ది.. సోకు నార్త్ ది: వైఎస్ షర్మిల...** జనాభా ప్రాతిపదికన సీట్లను విభజిస్తే దక్షిణాదికి జరిగేది తీరని నష్టమే అని వైఎస్ షర్మిల అన్నారు. డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలది రాజకీయం కాదని.. ప్రజల హక్కుల కోసం చేసే పోరాటమని అన్నారు. ఉత్తరాది ప్రాబల్యం మరింతగా పెరిగి.. సౌత్ రాష్ట్రాల ప్రాధాన్యతతో పనిలేకుండా పోతుందని తెలిపారు. సొమ్ము సౌత్ ది.. సోకు నార్త్ ది అనే పరిస్థితి ఎదురుకాక తప్పదని హెచ్చరించారు. డీలిమిటేషన్ పేరుతో లిమిటేషన్ ఫర్ సౌత్‌లా చేస్తామంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత విధానంతో ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే 143 సీట్లకు పెరిగితే.. దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, ఏపీ, తెలంగాణ లాంటి ప్రధాన రాష్ట్రాల్లో పెరిగే సీట్లు 49o41o54 = 144 అని.. ఇది కాదా వివక్ష చూపడం అంటే అని ప్రశ్నించారు. యూపీ, బీహార్ రెండు రాష్ట్రాలు కలిపితే 222 సీట్లు పెరిగితే... సౌత్ మొత్తం తిప్పి కొట్టినా 192 సీట్లకే పరిమితమవుతుందన్నారు. ఇది కాదా దక్షిణ భారతంకి జరిగే అన్యాయమని మండిపడ్డారు. డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల పోరాటానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. ఐక్యంగా పోరాటం చేస్తే తప్ప నియంత మోదీకి బుద్ధి రాదన్నారు. ఏపీలో మోదీ పక్షం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మౌనం వహించడం రాష్ట్ర ప్రజలను మోసం చేసినట్లే అని అన్నారు. ప్రజల హక్కులను కాలరాసినట్లే అని చెప్పుకొచ్చారు. డీలిమిటేషన్‌పై రాజకీయాలు పక్కన పెట్టి టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు ముందుకు రావాలని వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు.

**దక్షిణాది రాష్ట్రాల భేటీ...** కాగా.. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై చెన్నై దక్షిణాది రాష్ట్రాలు సమావేశమయ్యాయి. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్షాల నేతలు తరలివచ్చారు. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి సీఎం రేవంత్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. కేరళ సీఎం పినరయి విజయన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పాల్గొన్నారు.




# పేటలో రజినీ vs రాజశేఖర్

ఏళ్ల తరబడి కాపాడుకుంటూ వస్తున్న చిలకలూరిపేట తనది కాదని అన్నారు మర్రి రాజశేఖర్. ఎక్కడి నుంచో వచ్చినా విడుదల రజనీని హక్కున చేర్చుకోవడంతో మర్రి రాజశేఖర్ వృక్షం కూలిపోయింది. దాంతో తన వల్ల కాదంటూ వైసీపీలో తాను ఉండలేను అంటూ ఎమ్మెల్సీ పదవికి పార్టీకి రాజీనామా చేసేశారు రాజశేఖర్. వైసీపీలో తనను చులకనగా చూశారు అని, తన రాజీనామాకు జగనే కారణం అంటూ వ్యాఖ్యలు చేశారు. కేవలం విడదల రజినీని ప్రమోట్ చేసేందుకు పార్టీలో తనను తొక్కేశారు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పదవి ఇవ్వలేదని, చివరి నిమిషంలో ఎమ్మెల్సీని చేశారని చెప్పుకొచ్చారు. అయితే మర్రి రాజశేఖర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ గా రజినీ సైతం ప్రెస్‌మీట్ పెట్టి మర్రి ఆరోపణలను ఖండించారు. జగన్ చెబితేనే తాను ఏదైనా చేశానని, రాజశేఖర్ కు పార్టీలో సరైన ప్రాధాన్యమే ఇచ్చారని చెబుతూ మేటర్ కవర్ చేసే ప్రయత్నం చేసింది. ఇలాంటి పొలిటికల్ స్టేట్మెంట్స్ కామనే అయినా మర్రి రాజశేఖర్ మేటర్ మాత్రం కామన్ కానే కాదని రాజకీయాల్లో మర్రికి జరిగినంత అన్యాయం మరే లీడర్ కూ జరిగలేదనేది ఆయన వినిపిస్తున్న మాట. కాగా మర్రి రాజశేఖర్ చిలకలూరు పేట వైసీపీ స్ట్రాంగ్ లీడర్. జగన్ కు బలమైన సపోర్టర్. 2019లో దాదాపు ఆయనకు ఎమ్మెల్యే టికెట్. ఇలాంటి సమయంలో విడదల రజినీ వైసీపీలో ఎంట్రీ ఇవ్వడంతో మర్రికి బ్యాడ్ టైమ్ స్టార్ట్ అయిందట. హైటెక్ సిటీలో చంద్రబాబు నాటిన మొక్కను తానంటూ టీడీపీ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న రజినీ సడెన్‌గా జగన్ చెంతకు చేరడంతో ఆమెను నెత్తిన పెట్టుకున్నారు వైసీపీ అధినేత జగన్. చిలుకలూరిపేటలో మర్రి రాజశేఖర్ ని కాదని విడదలను ప్రమోట్ చేశారు. విపరీతంగా డబ్బులు వెదజల్లి సోషల్ మీడియాలో ఫుల్ ప్రమోషన్ చేయించుకుని చాకచక్యంగా ఎమ్మెల్యే టికెట్ ఎగరేసుకుపోయారు. దాంతో మర్రి రాజశేఖర్ హర్ట్ అయ్యారు. మర్రికి మంత్రి పదవి ఇస్తానంటూ బహిరంగంగా ప్రకటించి ఆయన్ను బుజ్జగించారు జగన్. మొత్తంగా చూసుకుంటే ఇప్పుడు విడదల రజినీపై రివేంజ్ తీర్చుకోవడమే ప్రస్తుతం మర్రి రాజశేఖర్ టార్గెట్ గా కనిపిస్తోంది. మరి చిలకలూరిపేటలో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి.

# విశాఖ మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమైన కూటమి నేతలు.. కలెక్టర్‌కు వినతి పత్రం

విశాఖ : విశాఖ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూటమి సభ్యులు సిద్ధం అవుతున్నారు. ఈ మేరకు కూటమి నేతలు పీలా శ్రీనివాసరావు, వెలగపూడి, గణబాబు, గండి బాబ్జి, మరికొంత మంది నేతలు శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఇటీవలే వైకాపాకు చెందిన ఆరుగురు కార్పొరేటర్లు తెదేపాలో చేరిన విషయం తెలిసిందే. నాలుగేళ్ల పాటు మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టకూడదన్న చట్టం అమల్లో ఉండటంతో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. ఇప్పటివరకు అవిశ్వాసం పెట్టలేదు. మార్చి 18తో నాలుగేళ్ల కాలపరిమితి పూర్తవనున్న నేపథ్యంలో మహా విశాఖ నగర పాలక సంస్థ 'మేయర్' పీఠం దక్కించుకోవడానికి కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు

# ఇప్పటికైనా జగన్ అది తెలుసుకుంటే మేలు: లోకేశ్



అమరావతి: ప్రభుత్వం శాశ్వతం.. రాజకీయాలు ఎన్నికలకే పరిమితమని ఇప్పటికైనా జగన్ తెలుసుకోవాలని మంత్రి నారా లోకేశ్ హితవు పలికారు. ప్రభుత్వం మారినా.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగించడం సంప్రదాయమన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని గతంలో జగన్ విధ్వంస పాలనతో బ్రేక్ చేశారని విమర్శించారు. "2019లో జగన్ అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ బకాయిలు చెల్లించనని మొండికేశారు. తెదేపా హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను నిలిపేశారు. మరికొన్ని ధ్వంసం చేశారు.

ఇలాంటి నిరంకుశ మనస్తత్వం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. మేం అధికారంలోకి రాగానే జగన్ పెట్టిన బకాయిలు చెల్లించాం. ఆర్థిక ఇబ్బందులున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేశాం. విద్యార్థులు, తల్లిదండ్రులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చేయడమే బాధ్యతగా తీసకున్నాం" అని లోకేశ్ తెలిపారు.

# చిల్లింగ్ మూడ్‌లో అందాల రకుల్


కన్నడ మూవీ గిల్లితో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. మొదటి సినిమాతో నటిగా మంచి గుర్తింపు దక్కించుకోవడంతో టాలీవుడ్‌లో 'కెరటం' సినిమాతో ఎంట్రీ ఇచ్చే అవకాశం దక్కించుకుంది. టాలీవుడ్‌లో మొదటి సినిమా నిరాశ పరచడంతో తదుపరి ఆఫర్ కోసం రెండేళ్లు వెయిట్ చేయాల్సి వచ్చింది. 2013లో సందీప్ కిషన్‌కి జోడీగా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాలో నటించింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, సినిమాలో ఆమె పాత్రకు మంచి ప్రాముఖ్యత లభించింది, పాత్రకు తగ్గట్లుగా రకుల్ ప్రీత్ సింగ్ తన నటనతో మెప్పించింది. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమా తర్వాత రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్‌లో వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. టాలీవుడ్‌లో దాదాపు పదేళ్ల పాటు వరుసగా సినిమాలు చేసింది. ఒకానొక సమయంలో టాలీవుడ్ స్టార్ హీరోలకు సైతం డేట్లు ఇవ్వలేని పరిస్థితిలో రకుల్ ప్రీత్ సింగ్ సినిమాలు చేసింది. టాలీవుడ్‌లోని దాదాపు అందరు



స్టార్ హీరోల సినిమాల్లోనూ రకుల్ ప్రీత్ సింగ్ నటించిన విషయం తెల్సిందే. తెలుగులో ఈ అమ్మడు దశాబ్ద కాలం పాటు వెనక్కి తిరిగి చూసుకోకుండా సినిమాలు చేసింది. కానీ గత కొన్నాళ్లుగా ఈమెకు టాలీవుడ్‌లో ఆఫర్లు కనిపించడం లేదు. టాలీవుడ్‌లో ఆఫర్లు దక్కని సమయంలో బాలీవుడ్‌లో సినిమాలు చేసింది. అక్కడ ఒకే సారి అర డజను సినిమాలు చేయడంతో బిజీ హీరోయిన్‌గా మారింది. కానీ ఆ అరడజను సినిమాల్లో ఒక్కటి కూడా రకుల్ కి హిట్ తెచ్చి పెట్టలేదు. సినిమాలతో బిజీగా లేని ఈ సమయంలో సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. అందమైన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తున్న రకుల్ ప్రీత్ సింగ్ ఎప్పటికప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. తాజాగా మరో ఫోటో షూట్‌ను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. ఇటీవల రకుల్ భర్తతో కలిసి విదేశాలకు వెళ్లిన విషయం తెల్సిందే. వివాహ వార్షికోత్సవం సందర్భంగా విదేశాల్లో హాలీడేస్‌ను ఎంజాయ్ చేసిన రకుల్, జాకీ భగ్నాని సోషల్ మీడియాలో పలు ఫోటోలను షేర్ చేశారు. అందులో భాగంగా ఈ ఫోటోలు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రకుల్ చాలా సంతోషంగా, చిల్లింగ్ మూడ్‌తో చిరు మందహాసంతో కనిపిస్తూ చూపరుల దృష్టిని ఆకర్షిస్తోంది. రకుల్ ప్రీత్ సింగ్ ఈ ఏడాదిలో మేరి హస్బెండ్‌కి బివి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. అయినా ఈమె చేతిలో రెండు హిందీ సినిమాలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా సూపర్ హిట్ సీక్వెల్ 'దే దే ప్యార్ దే 2' పై ఈమె ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తుంది. ఈ సీక్వెల్‌తో పాటు మరో హిందీ సినిమాలోనూ ఈమె ఎంపిక అయింది. ఆ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో ఉండే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇండియన్ 3 లోనూ ఈమె కీలక పాత్రలో కనిపించబోతుంది అనే విషయం తెల్సిందే. ప్రస్తుతం ఈమె చేతిలో ఉన్న సినిమాలు కొన్నే కావడంతో వాటి ఫలితాలు ఎలా ఉంటాయి, భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే ఆందోళన ఆమె ఫ్యాన్స్‌లో వ్యక్తం అవుతోంది. రకుల్ మాత్రం చాలా నమ్మకంతో కెరీర్‌లో ముందుకు సాగుతుంది.

# ప్రభాస్ రాజాసాబ్ ఐదు నెలలు..!

ప్రభాస్ 'రాజాసాబ్' ఏప్రిల్ 10, 2025న విడుదల కావాల్సి ఉండగా వాయిదా పడనున్నట్లు కన్ఫర్మ్ అయింది. ఇప్పటి వరకు షూటింగ్ పూర్తి చేయలేదని తెలుస్తోంది. సినిమా షూటింగ్ ప్రారంభం అయి దాదాపు మూడు ఏళ్లు అవుతున్నా కొన్ని కారణాల వల్ల ఆలస్యం అవుతూ వచ్చింది. కల్కి 2898 ఏడీ సినిమా విడుదదలైన తర్వాతే రాజాసాబ్ సినిమాకు ప్రనభాస్ ఎక్కువ డేట్లు ఇచ్చినట్లు నిర్మాత చెప్పుకొచ్చారు. ఈ సమ్మర్‌లో ప్రభాస్ సినిమా వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్న ఫ్యాన్స్‌కి నిరాశే మిగిలింది. ఈ ఏడాదిలో 'రాజాసాబ్' సినిమాతో పాటు 'ఫౌజీ' సినిమా సైతం వస్తుందనే ప్రచారం జరిగింది. కానీ రాజాసాబ్ సినిమా ఆలస్యం కావడంతో 'ఫౌజీ' సినిమా ఈ ఏడాదిలో వచ్చే అవకాశం లేదు. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజాసాబ్' సినిమాలో ప్రభాస్‌కి జోడీగా మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. హర్రర్ కామెడీ మూవీగా రూపొందుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. తమన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ సినిమాకి త్వరలో కొత్త విడుదల తేదీని కన్ఫర్మ్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ముందుగా అనుకున్న విడుదల తేదీకి ఐదు నెలల ఆలస్యంగా రాజా సాబ్ సినిమాను విడుదల చేసే



అవకాశాలు ఉన్నాయి. సినీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాను సెప్టెంబర్ నెలలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. దసరా సీజన్ కంటే ముందుగానే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా మారుతి ప్లాన్ చేస్తున్నాడట. ప్రభాస్ గత చిత్రాలు సలార్, కల్కి 2898 ఏడీ సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకున్నాయి. దాంతో రాజాసాబ్ సినిమాతో ప్రభాస్ హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే నమ్మకంతో ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మొదట్లో మారుతి దర్శకత్వంలో ప్రభాస్ సినిమా ఏంటో అని విమర్శించిన వారు చాలా మంది ఉన్నారు. ముఖ్యంగా ప్రభాస్ ఫ్యాన్స్‌లో చాలా మంది మారుతి దర్శకత్వంలో సినిమాపై ట్రోల్ చేశారు. కానీ సినిమా నుంచి వస్తున్న ఒక్కో అప్‌డేట్ అంచనాలు పెంచుతూ వచ్చింది. ముఖ్యంగా ప్రభాస్ లుక్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది.




# మ్యాడ్ స్క్వేర్ అసలు సర్‌ప్రైజ్ వేరే ఉందట!




టాలీవుడ్ లో వచ్చే వారం రెండు సినిమాలు రిలీజ్ కానున్నాయి. అవి రాబిన్‌హుడ్ మరియు మ్యాడ్ స్క్వేర్ సినిమాలు. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన రాబిన్‌హుడ్ సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా నటించగా, మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించింది. మార్చి 27న రాబిన్‌హుడ్ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రెండో సినిమా మ్యాడ్ స్క్వేర్. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా కామెడీ అండ్ యూత్ ఫుల్ ఎంటర్టైనర్ మ్యాడ్ కు సీక్వెల్ గా తెరకెక్కింది. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో నాగవంశీ నిర్మించారు. ఈ మూవీ మార్చి 28న రిలీజ్ కానుంది. అయితే ఈ రెండు సినిమాలకీ మంచి బజ్ ఉంది. ముందుగా రాబిన్‌హుడ్ మూవీ గురించి మాట్లాడుకుంటే అప్పటివరకు ఉన్న క్రేజ్ ను అదిదా సర్‌ప్రైజు సాంగ్ తో కేతిక శర్మ ఒక్కసారిగా పెంచేసింది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఆ సాంగ్ కు సంబంధించిన రీల్సే కనిపిస్తున్నాయంటే ఆ సాంగ్ సినిమాకు ఎంత ప్లస్ అయిందో అర్థం చేసుకోవచ్చు. ఇక మ్యాడ్ స్క్వేర్ విషయానికొస్తే బ్లాక్ బస్టర్ ఎంటర్టైనర్ కు సీక్వెల్ గా వస్తున్న మూవీ కావడంతో దీనికి ఆల్రెడీ మంచి హైపే ఉంది. అంతేకాదు రాబిన్‌హుడ్ తరహాలోనే మ్యాడ్ స్క్వేర్ లో కూడా ఓ సర్‌ప్రైజ్ ఉందట. కావాలనే మేకర్స్ దాన్ని బయటకు చెప్పడం లేదని తెలుస్తోంది. ఆ సర్‌ప్రైజ్ మరేదో కాదు, మ్యాడ్ స్క్వేర్ లో ప్రియాంక జవాల్కర్ ఓ స్పెషల్ రోల్ లో కనిపించడంతో పాటూ స్పెషల్ సాంగ్ లో మెరవనున్నట్టు తెలుస్తోంది. ట్యాక్సీవాలా, ఎస్ఆర్ కళ్యాణమండపం, డీజే టిల్లూ సినిమాల్లో కనిపించి మెప్పించిన ప్రియాంక ఇప్పుడు మ్యాడ్ స్క్వేర్ లో కనిపించి సందడి చేయనుంది. కావాలనే చిత్ర యూనిట్ ఆ సాంగ్ ను ఇప్పటివరకు రిలీజ్ చేయలేదని, ట్రైలర్ కు కొంచెం ముందుగా ఆ సాంగ్ ను రిలీజ్ చేసి సినిమాపై ఉన్న బజ్ ను ఒక్కసారిగా పెంచాలని చూస్తున్నాడట నిర్మాత నాగవంశీ. మరి ఈ సర్‌ప్రైజ్ సాంగ్ ఎలా ఉంటుందో చూడాలి. ఈ సాంగ్ కూడా ఆడియన్స్ ను ఇంప్రెస్ చేస్తే రెండు సినిమాలకీ చాలా టఫ్ కాంపిటీషన్ ఉండే ఛాన్సుంది.

# పవన్ -బాలయ్య మధ్య యుద్ధం తప్పదా!



నటసింహ బాలకృష్ణ-పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మధ్య వార్ తప్పదా? బాలయ్య సై అంటే పవన్ సైసై అంటాడా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తుంది. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో అఖండ-2 శివతాండవం భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. మరోసారి బాలయ్య నట విశ్వరూపం తాండవంలో చూబోతున్నారు. ఎగ్జోటిక్ లోకేషన్స్ లో షూటింగ్ జరుగుతుంది. బాలయ్య నార్త్ ఇమేజ్ ని దృష్టిలో పెట్టుకుని ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా చిత్రీకరణ జరుపుతున్నారు. ఇప్పటికే కుంభమేళాలో చిత్రీకరించిన సన్నివేశాలు సినిమాకు హైలైట్ గా ఉంటాయని టాక్ వినిపిస్తుంది. ఈ సినిమా రిలీజ్ తేదీని కూడా బోయపాటి ముందే ప్రకటించారు. అన్ని పనులు పూర్తి చేసి సెప్టెంబర్ 25 రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సినిమా డిలే అయ్యే అవకాశం లేదు. చెప్పింది చెప్పినట్లు చేయడం బాలయ్య కు అలవాటు. పైగా బాలయ్య సినిమా రిలీజ్ తేదీ ఫిక్స్ అయిందంటే? అదో సెంటిమెంట్. దాని వెనుక ఎన్నో లాజిక్కు లు ఉంటాయి. మార్చడానికి వీలు లేని టెక్నికల్ విషయాలు ఉంటాయి. అయితే సరిగ్గా ఇదే తేదీకి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తోన్న ఓజీ సినిమా రిలీజ్ అయ్యే అవకాశాలున్నాయంటున్నారు. ఓజీ%-% షూటింగ్ డిలే అవుతున్న నేపథ్యంలో యూనిట్ సెప్టెంబర్ 25వ తేదీని పరిశీలిస్తున్నారు. అదే జరిగితే బాలయ్య-పవన్ మధ్య బాక్సాఫీస్ వద్ద యుద్ధమే. పవన్ వస్తున్నాడని బాలయ్య వెనక్కి తగ్గరు. పైగా సీనియర్ నటుడు. రాజీ పడే ప్రశక్తే ఉండదు. ఇంకా బాలయ్య పెద్దరికాన్ని దృష్టిలో పెట్టుకుని పవన్ తగ్గాల్సి ఉంటుంది. ఓజీ రిలీజ్ తేదీ అదే రోజు అయితే ఖరారైతే గనుక సంబరాల ఏటిగట్టు వాయిదా పడుతుంది. ఇప్పటికే ఈ సినిమా సెప్టెంబర్ 25 ప్రకటించిన సంగతి తెలిసిందే.

# న్యూ స్టైల్ లో సామ్ స్టన్నింగ్ లుక్.. మైండ్ బ్లోయింగ్ అనాల్సిందే..

సినిమా ఇండస్ట్రీలో ఎంతమంది స్టార్ హీరోయిన్స్ ఉన్నా కూడా కొందరి పేర్లు చిరస్థాయిగా నిలిచేలా ఉంటాయి. అలాంటి మంచి గుర్తింపు అందుకున్న వారిలో సమంత రూత్ ప్రభు కూడా టాప్.లిస్టులో ఉంటుందని చెప్పవచ్చు. ఇటీవల కాలంలో అమ్మడు కాస్త సినిమాలు తగ్గించినా కూడా తన గ్లామర్ తో మాత్రం ఎప్పటికప్పుడు సరికొత్తగా కనిపిస్తూనే ఉంది. తెలుగుతో పాటు తమిళ పరిశ్రమలోనూ సమంతకు మంచి మార్కెట్ ఉంది. ఇటీవల కొంత గ్యాప్ తీసుకున్నా.. మళ్లీ కొత్త ప్రాజెక్ట్స్‌తో అభిమానుల ముందుకు రానుంది. సినిమాల్లో మాత్రమే కాకుండా, సమంత సోషల్ మీడియాలోనూ తనదైన ముద్ర వేస్తోంది. ప్రతి ఫోటోషూట్‌లోనూ కొత్తదనాన్ని తీసుకురావడం సమంత ప్రత్యేకత. గ్లామర్ ఫోటోషూట్లలోను, ట్రెడిషనల్ లుక్స్‌లోను అదరగొట్టే ఈ భామ, తన కొత్త స్టైల్ స్టేట్మెంట్‌లతో అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది. ఇటీవల ఆమె ఫిట్‌నెస్, మైండ్సెట్ గురించి ఎక్కువగా ఫోకస్ చేస్తూ, ఆరోగ్యాన్ని



మెరుగుపరుచుకునేందుకు కృషి చేస్తోంది. కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న ఒడిదొడుకులను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతోంది. ఇప్పుడు లేటెస్ట్ గా సమంత చేసిన ఫోటోషూట్ మళ్లీ ట్రెండ్ అవుతోంది. లావెండర్ షేడ్స్‌లో డిజైన్ చేసిన స్టైలిష్ సారీ, గ్లామర్ టచ్‌తో ఉన్న బ్లౌజ్, బ్రిలియంట్ కేప్ డిజైన్‌తో కూడిన ఈ అవుట్‌ఫిట్‌లో సమంత మైండ్ బ్లోయింగ్ లుక్‌తో కనిపించింది. ఆమె మేకప్, హెయిర్‌స్టైల్ అన్ని కూడా హై క్లాస్ ఫీల్ ఇచ్చేలా ఉన్నాయి. ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్, డిజైనర్స్ సమర్థంగా ప్లాన్ చేసిన ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సమంత తనదైన గ్రేస్, స్టైలిష్ అటిట్యూడ్‌తో ఈ ఫోటోషూట్‌ను మరింత స్పెషల్‌గా మార్చింది. ఇకపోతే, సమంత కెరీర్ పరంగా 'సిటాడెల్' వెబ్ సిరీస్‌తో మంచి గుర్తింపు అందుకుంటోంది. హాలీవుడ్ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌లో సమంత యాక్షన్ సీన్స్ చేయడం విశేషం. మరోవైపు ఆమె రక్త బ్రహాండ్ అనే చిత్రంతోనూ బిజీగా ఉంది. ఇప్పుడు ఆమె కొత్త లుక్, ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ చూసిన తర్వాత, అభిమానులు మరోసారి ఆమె బిగ్ స్క్రీన్ మేజిక్ చూడటానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# 15 రోజులు కోమాలో ఉన్నా: ముమైత్ ఖాన్

ఒకప్పటి స్టార్ ఐటెం డ్యాన్సర్‌గా మంచి క్రేజ్ అందుకున్న ముమైత్ ఖాన్ గత కొన్నేళ్లుగా సినిమాలకు దూరంగా ఉంది. తెలుగు, తమిళ, హిందీ సినిమాల్లో పలు బిగ్ ప్రాజెక్టుల్లో కనిపించిన ఆమె, తన డ్యాన్స్ మ్యూమెంట్స్‌తో అభిమానులను మెస్మరైజ్ చేసింది. అప్పట్లో పెద్ద సినిమాల్లో ముమైత్ తో ఒక సాంగ్ పక్కా ఉండేది. అయితే కొన్నాళ్ల అనంతరం ఆమె కెరీర్ కాస్త డీలాపడింది. టీవీ షోలతో పాటు కొన్ని ప్రత్యేక పాత్రలతో ప్రయత్నించినా, ముమైత్ కి మళ్లీ క్రేజ్ రాలేదు. అయితే ఇటీవల, ఆమె మేకప్ %డ% హెయిర్ అకాడమీ ప్రారంభించి మళ్లీ మీడియా ఫోకస్‌లోకి వచ్చింది. ప్రముఖ డ్యాన్సర్‌గా ఎన్నో సూపర్ హిట్ పాటల్లో అలరించిన ముమైత్ ఖాన్ అకస్మాత్తుగా తెరమరుగయ్యిందని అనేక ఊహాగానాలు వినిపించాయి. సోషల్ మీడియాలోనూ ఆమె గురించి చాలా తక్కువగా వినిపించడం, ఏమైందో అనే ఆసక్తిని పెంచింది. అయితే తాజాగా ముమైత్ ఖాన్ తన గైర్హాజరీకి గల అసలు కారణాన్ని బయటపెట్టింది. ఇది అభిమానులను ఒక్కసారిగా షాక్‌కు గురిచేసే విధంగా ఉంది. ముమైత్ తన జీవితంలో తాను ఎదుర్కొన్న అతి పెద్ద సంఘటన గురించి వివరించింది. "ఇంట్లో డ్యాన్స్ చేస్తూ ఉండగా కాలు జారిపోయి బెడ్‌కి తల బలంగా తగిలింది.



అయితే, బయటకు రక్తం రాలేదుకానీ, లోపల పెద్ద ప్రమాదం జరిగింది. అప్పుడే మా అమ్మ నన్ను హాస్పిటల్‌కి తీసుకెళ్లింది. అక్కడ డాక్టర్లు చాలా సీరియస్‌గా స్పందించి, మూడు నరాలు పూర్తిగా కట్ అయ్యాయని చెప్పారు. వెంటనే ముంబైలోని ఓ ప్రముఖ హాస్పిటల్‌లో నాకు సర్జరీ చేశారు. అయితే, అనుకోకుండా 15 రోజులు కోమాలో ఉండాల్సి వచ్చింది" అని చెప్పుకొచ్చింది ముమైత్. ఆమె చెప్పిన మరొక షాకింగ్ విషయం కూడా ఆశ్చర్యం కలిగిస్తోంది. కోమా నుంచి బయటకు వచ్చిన తర్వాత తన మెమరీలో మార్పు వచ్చిందని చెప్పింది. "15 రోజుల తర్వాత నాకే తెలియకుండా మెలకువ వచ్చింది. కానీ అప్పటికే నా మెమరీ లాస్‌కి గురైంది. ముఖాలు గుర్తుపట్టలేకపోయాను. కొన్ని రోజుల పాటు మళ్లీ ఎవరితోనూ మాట్లాడలేను. కొన్ని సంఘటనలు ఇప్పటికీ గుర్తుకు రావు. అవి గుర్తు చేసుకోవడానికి చాలా ఒత్తిడిగా అనిపిస్తుంది. అయితే ప్రస్తుతం నేను పూర్తిగా కోలుకున్నాను" అంటూ ఆమె వివరించింది. ప్రస్తుతం ముమైత్ ఖాన్ మళ్లీ తన కెరీర్‌ని ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. గతంలో స్పెషల్ సాంగ్స్ తో పాటు ముమైత్ పలు పవర్ఫుల్ క్యారెక్టర్లు కూడా చేసింది. మైసమ్మ ఐపీఎస్, పున్నమి నాగ్ లాంటి సినిమాల్లో లీడ్ రోల్స్ చేసింది. ఇక చివరగా 2019లో RDX లవ్ అనే సినిమాలో కనిపించిన ముమైత్ బిగ్ బాస్ షోలో కూడా కాంటెస్టెంట్ గా పాల్గొంది. ఇక ఇప్పుడు ఆమె వేసే అడుగులు ఏ విధంగా ఉంటాయో చూడాలి.



# డీలిమిటేషన్‌పై రెండో సమావేశం.. హైదరాబాద్‌లోనే

డీలిమిటేషన్ పై మార్చి 22న చెన్నైలో సీఎం ఆధ్వర్యంలో ఆల్ పార్టీ మీటింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమావేశానికి కేరళ సీఎం పినరయి విజయన్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు దేశ వ్యాప్తంగా ప్రముఖ రాజకీయ నాయకులు పాల్గొన్నారు. 25 ఏళ్ల వరకు నియోజకవర్గాల పునర్విభజన చేయొద్దని ఆల్ పార్టీ మీటింగ్ తీర్మానం చేసింది. అయితే పునర్విభజనకు వ్యతిరేకంగా తీర్మానాన్ని హైదరాబాద్ లో నిర్వహించాలని సీఎం రేవంత్ ప్రతిపాదన పెట్టారు. దీనికి సీఎం స్టాలిన్ అంగీకరించారు. డీలిమిటేషన్ పై రెండో సమావేశం తెలంగాణలోని హైదరబాద్ లో నిర్వహిస్తామని తమిళనాడు సీఎం స్టాలిన్ అన్నారు . రెండు రోజుల పాటు సమావేశం నిర్వహిస్తామని.. తేదీలు త్వరలో ఖరారు చేస్తామని చెప్పారు. ఈ సమావేశం తర్వాత అవసరమైతే బహిరంగ సభ కూడా నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ వ్యతిరేకం కాదని, న్యాయం కోసమే పోరాటమని స్టాలిన్ చెప్పారు. డీలిమిటేషన్ అంశంపై కలిసికట్టుగా పోరాడతామని డీలిమిటేషన్‌పై చెన్నైలో జరిగిన ఆల్‌పార్టీ మీటింగ్‌లో స్టాలిన్ స్పష్టం చేశారు.

డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఈ సమావేశంలో పార్టీలు ప్రతిపాదించాయి. ఆల్ పార్టీ మీటింగ్ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ.. మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయీ విధానాన్ని పాటించడమే ఉత్తమమని.. మరో 25 ఏళ్ల పాటు లోక్ సభ సీట్లలో ఎటువంటి మార్పు తీసుకురావద్దని అన్నారు సీఎం రేవంత్. సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా పునర్విభజన ప్రక్రియ చేపట్టాలని అన్నారు. దేశ ఖజానాకు దాక్షిణాది రాష్ట్రాలు పెద్ద మొత్తంలో నిధులు ఇస్తూ తక్కువ మొత్తాన్ని పొందుతున్నాయని అన్నారు. తమిళనాడు పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 29 పైసలే వెనక్కి వస్తున్నాయని.. ఉత్తర ప్రదేశ్‌కు రూపాయికి రెండు రూపాయల 73 పైసలు వెనక్కి వెళుతున్నాయని అన్నారు. బీహార్ రూపాయి చెల్లిస్తే 9 రూపాయల 22 పైసలు వెనక్కి తీసుకుంటుంటే.. కర్ణాటకకు కేవలం 14 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయని అన్నారు రేవంత్. అదే సమయంలో మధ్య ప్రదేశ్ రూపాయి పన్ను రూపంలో కేంద్రానికి ఇస్తే వెనక్కి రూ. 2.79 పైసలు వెళుతున్నాయని అన్నారు.

## రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే.. పార్టీ అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారు: రాజాసింగ్



హైదరాబాద్: సొంత పార్టీ నేతలపై భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి త్వరలో కొత్త భాజపా అధ్యక్షుడు వస్తున్నారని చెప్పారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేది రాష్ట్ర కమిటీనా, జాతీయ నాయకత్వమా అని ప్రశ్నించారు. "రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే కొత్త అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారు. కొత్త అధ్యక్షుడిని జాతీయ కమిటీ నిర్ణయిస్తే బాగుంటుంది. గతంలో మనం చూసిన అధ్యక్షుడు గ్రూప్ తయారుచేసుకొని పార్టీకి నష్టం చేశారు. కొత్త భాజపా అధ్యక్షుడు అదే గ్రూపిజం చేస్తే పార్టీకి నష్టం. ప్రస్తుతం మంచి నాయకుల చేతులు కట్టి పడేశారు. సీనియర్ నాయకులకు స్వేచ్ఛ ఇస్తే తెలంగాణలో భాజపా ప్రభుత్వం వస్తుంది. పార్టీ కొత్త అధ్యక్షుడు సీఎంతో రహస్య భేటీలు నిర్వహించవద్దు. సీనియర్ నేతలు, కార్యకర్తల మనసులో మాట బయటపెడుతున్నా. పార్టీ నేతలకు చెప్పాలే గానీ మీడియాకు చెప్పవద్దని కొందరు చెబుతున్నారు. పార్టీ పెద్దల దృష్టికితెచ్చినా వినకపోవడం వల్లే ప్రజల ముందు పెడుతున్నా. సీనియర్ నాయకులను భాజపా గుర్తించలేదు. నామినేటెడ్ పోస్టులను సీనియర్ నేతలకు ఇవ్వడం లేదు" అని రాజా సింగ్ చెప్పారు.



# ట్రంప్ గోల్డ్ కార్డుకు భలే గిరాకీ!

## ట్రంప్ 'గోల్డ్ కార్డ్'కు భలే గిరాకీ.. ఒక్కరోజే 1000 విక్రయం!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన 'గోల్డ్ కార్డు'కు భారీ గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కరోజే 1000 కార్డులను విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హొవార్డ్ లుట్నిక్ వెల్లడించారు. వీటి ద్వారా 5బిలియన్ డాలర్లు సేకరించామని చెప్పారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. లక్షలాది మంది ఈ కార్డును కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, వీటిద్వారా 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉందన్నారు. "ప్రపంచ వ్యాప్తంగా 3.7కోట్ల మందికి ఈ కార్డు కొనే సామర్థ్యం ఉంది. కనీసం 10లక్షల మంది దీనిని కొనుగోలు చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు" అని లుట్నిక్ పేర్కొన్నారు. అసలు ఈ కార్డు ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఎవరిదన్న ప్రశ్నకు బదులిస్తూ.. ట్రంప్ మదిలో నుంచి వచ్చిన ఆలోచనే అని చెప్పారు. అధ్యక్షుడి ఆలోచనను అమలు చేయడమే తన బాధ్యత అని, దీన్ని అమలు చేసే ప్రణాళిక తన వద్ద ఉందన్నారు.

**ఇన్వెస్టర్ వీసాతో..** ప్రస్తుతం ఉన్న పెట్టుబడి వీసా ఈబీ-5 స్థానంలో గోల్డ్ కార్డు తీసుకురానున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. 5 మిలియన్ డాలర్లు చెల్లించగలిగే వారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని అందజేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులను ఆకర్షించేందుకే దీనిని ప్రవేశపెట్టామని, వారు అమెరికాకు వచ్చి భారీగా ఖర్చుపెడితే స్థానికంగా ఉద్యోగాలు కూడా పెరుగుతాయని ట్రంప్ పేర్కొన్నారు.

**సంపన్న వలసదారులకు.. ట్రంప్ 'గోల్డ్ కార్డ్' ఆఫర్...** ఇదే విషయంపై ఇటీవల మరో సందర్భంలో లుట్నిక్ మాట్లాడుతూ.. 2.5లక్షల మంది ఈ గోల్డ్ కార్డు కొనేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు. EB-5 ప్రోగ్రామ్ వల్ల జరుగుతున్న మోసాలు, ఇతర అక్రమాలను అరికట్టేందుకు వీటిని తీసుకొస్తున్నాం. చట్టబద్ధ ఇన్వెస్టర్లకు పౌరసత్వం, శాశ్వత నివాసం కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈబీ-5 వీసా విధానాన్ని అమెరికా 1990లో తీసుకొచ్చింది. వేలాది మంది ఈ ఇన్వెస్టర్ వీసాలను పొందారు. అయితే, ఈ విధానంతో మోసాలు జరుగుతున్నాయని, కొందరు అక్రమంగా నిధులు పొందుతున్నారని ఇటీవల జరిపిన అధ్యయనంలో తేలింది. దీంతో 2022లో కొన్ని సవరణలు చేశారు. తాజాగా దీని స్థానంలో గోల్డ్ కార్డును ప్రవేశపెడుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

## 'హత్య' సినిమా సన్నివేశాలు వైరల్.. సునీల్ యాదవ్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు



పులివెందుల: వివేకా హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. 'హత్య' సినిమాలో తనతో పాటు తన తల్లిని క్రూరంగా చిత్రీకరించారని అందులో పేర్కొన్నారు. ఏ1గా 'వైఎస్ అవినాష్ అన్న యూత్' వాట్సప్ గ్రూప్ అడ్మిన్ పవన్ కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఏ2గా వైకాపా సోషల్ మీడియా కడప అడ్మిన్‌పై కేసు నమోదు చేశారు. హత్య సినిమా డైరెక్టర్, నిర్మాత, రైటర్‌తో పాటు మరికొందరిపై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. పవన్ కుమార్ అనే వ్యక్తి వైకాపా వాట్సప్ గ్రూపులో 'హత్య' సినిమాకు సంబంధించిన సన్నివేశాలు వైరల్ చేస్తున్నాడని సునీల్ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఇంటి వద్ద పలువురు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని చెప్పారు. దీంతో పోలీసులు బీఎన్ఎస్, ఐటీ యాక్టు 67 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. తనకు ప్రాణహాని ఉందని సునీల్ యాదవ్ 2 రోజుల క్రితం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.



# పీపీపీ విధానంలో రోడ్లు వేయట్లేదు హ్యామ్ పద్ధతిలోనే రహదారుల అభివృద్ధి

**తెలంగాణలో తమ ప్రభుత్వం పీపీపీ విధానాన్ని అనుసరించి రోడ్లు వేయట్లేదని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ (హ్యామ్) విధానంలో రహదారులు వేస్తామన్నారు. పీపీటీ, హ్యామ్ రెండు వేర్వేరు విధానాలని తెలిపారు. శాసనసభలో హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌ను 18 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. గత పదేళ్లలో రోడ్ల నిర్మాణానికి రూ. 3945 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు.**

## డీలిమిటేషన్ దేశ సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం: కేటీఆర్



చెన్నై: కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత డీలిమిటేషన్ వల్ల అనేక నష్టాలు జరుగుతాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ వివక్షాపూరిత విధానాలతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతోందని వివరించారు. చెన్నైలో డీఎంకే ఆధ్వర్యంలో జరుగుతున్న డీలిమిటేషన్ సదస్సులో ఆయన మాట్లాడారు. "కేసీఆర్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాల పాటు తెలంగాణ ఉద్యమం నడిచింది. నియంతృత్వం, మందబలం ఉన్నప్పుడు జరిగే నష్టాలు మా తెలంగాణ ప్రజలకు తెలుసు. తెలంగాణ ఉద్యమ కాలంలో దిల్లీలో ఉన్న మంద బలంతో పాటు సమైక్యరాష్ట్రంలోని మెజార్టీ నాయకత్వంపైన పోరాటం చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చుకున్నాం. అస్తిత్వం కోసం, హక్కుల కోసం కొట్లాడడంలో తమిళనాడు స్ఫూర్తినిచ్చింది. ద్రవిడ ఉద్యమం సమైక్య దేశంలో తమ హక్కులు సాధించుకోవడానికి రాష్ట్రాలకు ఒక దిక్సూచిలా పనిచేస్తుంది" "మనమంతా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాం. దేశ అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్న రాష్ట్రాలకు నష్టం కలిగిస్తూ.. వెనక్కి నడుస్తున్న రాష్ట్రాలకు ఈ డీలిమిటేషన్ విధానం లాభం చేకూరుస్తుంది. పరిపాలన, ఆర్థిక అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయి. కానీ, దాని వల్లే తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. దేశ జీడీపీలో 36% భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు శిక్షను ఎదుర్కొంటున్నాయి" "డీలిమిటేషన్ అంశం కేవలం పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గడానికి పరిమితం కాదు. ఆర్థికపరమైన నిధుల కేటాయింపుల్లో కూడా తీవ్రమైన నష్టం జరగబోతుంది. వీటి కేటాయింపుల్లో కూడా అధికారం పూర్తిగా కేంద్రీకృతమై.. నియంతృత్వం వైపు దారితీసే అవకాశం ఉంది. భవిష్యత్తులోనూ దక్షిణాది రాష్ట్రాలకు నిధుల కేటాయింపుల్లో అన్యాయం మరింతగా పెరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ వివక్ష కొత్త కాదు. కానీ.. ఈ మధ్యకాలంలో ఈ వివక్ష, అన్యాయం మరింత పెరిగింది. ప్రస్తుతం భాజపా సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దీన్ని మరింత పెంచేలా డీలిమిటేషన్ అంశాన్ని ముందుకు తీసుకువచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులన్నీ ఉత్తరాదికే పరిమితం అవ్వడం ఇందుకు ఒక ఉదాహరణ" "కేవలం జనాభా ఆధారంగా సీట్ల పెరుగుదల జరిగితే.. దేశ సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉంది. వెనుకబడిన రాష్ట్రాలకు నిధులు ఇచ్చే అంశాన్ని మేము వ్యతిరేకించడం లేదు కానీ, నిధుల కేటాయింపులో వివక్షను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## డీలిమిటేషన్‌పై కలిసిన వారంతా దొంగల ముఠానే: బండి సంజయ్



హైదరాబాద్: గత పదేళ్లలో తెలంగాణలో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనూ రైతులను ఆదుకున్న దాఖలాలు లేవని చెప్పారు. ప్రస్తుతం వడగళ్ల వానతో నష్టోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో సమీక్షలు, సర్వేలు, నివేదికల పేరుతో కాలం గడిపారన్నారు. సర్వే చేసి వారం రోజుల్లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలిపారు. "డీలిమిటేషన్‌పై కలిసిన వారంతా దొంగల ముఠానే. భారాస, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటే. కేసుల నుంచి తప్పించుకునేందుకు భారాసకు కాంగ్రెస్ సహకరిస్తోంది. దిల్లీలో కలిసి ఉంటారు.. గల్లీలో కొట్లాడుకుంటారు. డీఎంకే భేటీకి రెండు పార్టీలు వెళ్లాయంటే.. ఇద్దరూ ఒక్కటా?కాదా? కేసుల విషయంలో కేసీఆర్ కుటుంబానికి ఒక్క నోటీసు కూడా ఇవ్వట్లేదు. భాజపాకు వ్యతిరేకంగా అందరూ కలిసి పోరాడుతున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. ఆరు గ్యారంటీల హామీల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ యత్నిస్తోంది. తమిళనాడులో డీఎంకే రూ.వెయ్యి కోట్ల మద్యం కుంభకోణం చేసింది. డీఎంకేను సాగనంపేందుకు అక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు పక్కా ప్రణాళికతో ఇదంతా చేస్తున్నారు. దక్షిణాదిలో సీట్ల సంఖ్య తగ్గించబోమని అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. డీలిమిటేషన్‌కు ఎలాంటి నియమ నిబంధనలు పెట్టలేదని చెప్పారు. చెన్నైలో జరిగేది మాఫియా ముఠాల సమావేశం. అవినీతి, స్కామ్ పార్టీలు కలిసి భాజపాను అప్రతిష్ఠ పాలు చేసేందుకు యత్నిస్తున్నాయి." అని బండి సంజయ్ మండిపడ్డారు.

# రేవంత్ రెడ్డితో మల్లారెడ్డి.. ఏంది కథ?



ఊరికే వెళ్లరు మహానుభావులు అని.. రాజకీయాల్లో ప్రతీ కలయిక వెనుక అర్థం పరమార్థం ఉంటాయి. పైకి అబ్బే అదేం లేదు అని చెప్పినా కూడా బలమైన అధికార శక్తులతో ప్రతిపక్ష నేతల భేటి ఎప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంటూనే ఉంటుంది. తెలంగాణ రాజకీయాల్లో సంచలన నేత మల్లారెడ్డి వ్యవహారశైలి కూడా విభిన్నంగా ఉంటుంది. ఆయన రాజకీయంగా ఎదిగేందుకు చాలా పార్టీలు మారారు. ఓసారి ఎంపీ, తర్వాత ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి కూడా అయ్యారు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డితో ఆయన భేటి కావడంతో ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత మల్లారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు రేవంత్ రెడ్డిని తీవ్రంగా వ్యతిరేకించిన మల్లారెడ్డి ఆయనతో సమావేశం కావడం అనేక ఊహాగానాలకు దారితీసింది. వీరిద్దరి మధ్య రాజకీయ వైరం అందరికీ తెలిసిందే. అలాంటి పరిస్థితుల్లో ఈ భేటీ రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ భేటీ అనంతరం మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని పెండింగ్ పనుల గురించే ముఖ్యమంత్రిని కలిశానని స్పష్టం చేశారు. "నా నియోజకవర్గం నుంచి కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పూర్తి చేయమని సీఎం రేవంత్ రెడ్డిని కలిస్తే తప్పేముంది?" అని ఆయన ప్రశ్నించారు. పార్టీ మారే ఆలోచన తనకు లేదని కూడా మల్లారెడ్డి తేల్చిచెప్పారు. "72 ఏళ్ల వయసులో నేనెందుకు పార్టీ మారుతాను?" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుండి తమ కుటుంబం నుంచి నలుగురు పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన చమత్కరించారు. ఒకవేళ జమిలీ ఎన్నికలు వస్తే తాను ఖచ్చితంగా ఎంపీగా పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. మల్లారెడ్డి, రేవంత్ రెడ్డిల మధ్య ఉన్న రాజకీయ విభేదాల దృష్ట్యా ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఈ భేటీ జరిగిందా లేక ఇందులో మరేదైనా రాజకీయ కోణం ఉందా అనేది వేచి చూడాలి. అయితే, ఈ సమావేశం తెలంగాణ రాజకీయాల్లో మాత్రం ఒక హాట్ టాపిక్‌గా మారింది.




## సుబ్బయ్య.. ఇంత గబ్బు ఏందయ్యా? ఎలా తింటున్నార్రా బాబు!

సుబ్బయ్య గారి హొటల్లో భోజనం అంటే మామూలుగా ఉండదు. ఆ హొటల్లో ఫుల్ మీల్స్ ఒక్కటే కాదు హొటల్ కూడా ఫేమస్. రెండు తెలుగు రాష్ట్రాల్లో లెక్కలేనన్ని బ్రాంచ్లు ఉన్నాయి. తింటే సుబ్బయ్య భోజనమే తినాలి.. అనేంతలా ఈ హొటల్ పాపులర్ అయింది. ముఖ్యంగా కాకినాడలో సుబ్బయ్య హొటల్కి చాలా క్రేజ్. అది ఇప్పుడు హైదరాబాద్ వరకూ విస్తరిచింది. తెలుగు రాష్ట్రాల్లో నోరూరించే ఫుడ్ ఏదన్నా ఉంది అంటే.. అది సుబ్బయ్య గారి భోజనమే అని చెప్తారు. కాకినాడలో ప్రారంభమైన ఈ హొటల్.. ఇప్పుడు వైజాగ్, విజయవాడ, సూర్యాపేట, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో విస్తరించింది. ఈ హొటల్లో వెజ్ మీల్స్కి భోజన ప్రియులు పడిచచ్చిపోతారు. అంతటి టేస్ట్ ఉంటుంది మరి. నోరూరించే రుచి, ఆకలి తీర్చే క్వాంటిటి వల్ల ఈ హొటల్ బాగా ఫేమస్ అయింది.

**సుబ్బయ్య హొటల్కు షాక్....** ఈ హొటల్లో ఒక్కసారి భోజనం చేశారంటే.. మళ్లీ మళ్లీ అక్కడకే వెళ్లాలి అనేంతలా ఉంటుంది. ఆహా ఇదేం భోజనం రా బాబు.. ఎంత తిన్నా తినాలనే అనిపిస్తుంది అని అంటారు. అలాంటి హొటల్ ఇప్పుడు దారుణంగా తయారైనట్లు అధికారుల తనిఖీలో బయటపడింది. హైదరాబాద్లోని కొండాపూర్లో కాకినాడ సుబ్బయ్య హొటల్లో టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీల్లో సంచలన విజువల్స్ బయటపడ్డాయి.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com